ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 27.0
కనిష్ఠం : 21.0

ఆధునిక పద్ధతులు అవలంభిస్తే అధిక దిగుబడులు : కలెక్టర్



పెదపాడు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): రైతులంతా వ్యవసాయ సాగులో ఆధునిక పద్ధతులను, టెక్నాలజీని అవలంభించి అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. పెదపాడు మండలం అప్పనవీడులో నిర్వహించిన 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా చేసేందుకు, ఆధు నిక వ్యవసాయ పద్ధతులపై రైతుల ఇంటి వద్దకు వెళ్లి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ మన్నారు. జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా, ఏడీఏ అనిలకుమారి, తహసీల్దారు కృష్ణజ్యోతి, ఏవో షేక్ ఇమామీ ఖాసిం, ఏరువాక కేంద్రం ఏలూరు శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణకు పీసా కమిటీ సమావేశాలు

ఏలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు చేసే భూసేకరణకు ఆయా గ్రామాల్లో పీసా కమిటి సమావేశాలు నిర్వహించి ఆమోదం తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి అధికారులు భూసేకరణపై జూమ్ కాన్ఫరెన్స్‌లో బుధవారం సమీక్షించారు. పోలవరం, గ్రీన్‌ఫీల్డ్ హైవే, పెడన- లక్ష్మీపురం, ఎన్‌హెచ్ 165కు, వివిధ రహదారుల భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

సారా విడిచిన కుటుంబాలకు మార్పుతో ఉపాధి

సారా తయారీని విడిచిపెట్టిన కుటుంబాలకు ఉపాధి(మార్పు)కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఎక్సైజ్, డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎక్సైజ్‌శాఖ చేపట్టిన మార్పుపై ఆమె బుధవారం సమీక్షించారు. సారా జోలికి వెళ్లకుండా గౌరవప్రదమైన మార్గాన్ని ఎంపిక చేసుకునేలా వారిలో పరివర్తన తీసుకువచ్చి వారికి ఉపాధి మార్గాలను స్థానికంగానే అందించాలన్నారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీలత మాట్లాడుతూ నాటుసారా వదిలిన కుటుంబాలకు ఉపాధికి వివిధ శాఖల ద్వారా రుణాలు అందించామని తెలిపారు.

రైతన్నా.. మీకోసం నేనున్నా!



నల్లజర్లలో రైతన్నా మీ కోసంలో రైతు పెనుమత్స సుబ్బరాజు సమస్యలను ఆలకిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నిమ్మల, అచ్చెన్నాయుడు, దుర్గేశ్, ఎమ్మెల్యే వెంకట్రాజు, జడ్పీ మాజీ చైర్మన్ బాపిరాజు తదితరులు

నల్లజర్లలో సీఎం చంద్రబాబు సభ సక్సెస్

- చెట్టు కింద.. నులక మంచంపై సీఎం సభ
- హంగూ ఆర్భాటం లేకుండా నిర్వహణ
- రైతుల సమస్యలు విన్నారు.. సలహాలు స్వీకరించారు..
- మీరు చెప్పింది చేస్తా అంటూ భరోసా

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

మీ సమస్యలు చెప్పండి.. నే వింటా.. పరిష్కరిస్తా.. అంటూ సీఎం చంద్రబాబు రైతులతో కలిసిపోయారు.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలోని ఒక వ్యవసాయ క్షేత్రంలో బుధవారం జరిగిన రైతన్నా-మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాధారణ నులక మంచంపై కూర్చుని రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఎటువంటి హంగూ ఆర్భాటం లేకుండా సీఎం చంద్రబాబు చెట్టుకింద కూర్చుని రైతులు



మంత్రి నిమ్మల రామానాయుడుతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

చెప్పింది ఆసక్తిగా విన్నారు.. సూచనలు.. సలహాలు స్వీకరించారు.. మీరు చెప్పింది నేను చేస్తా అంటూ వారి కి భరోసానిచ్చారు. సభ ఆరంభం నుంచి చివరి వరకూ వినూత్నంగా.. ఆసక్తిగా జరిగింది. ఉదయం 12 గంటలకు ఆరంభమైన చంద్రబాబు పర్యటన సాయంత్రం ఐదు గంటల వరకూ సాగింది. మొదట ఒక రైతు పొలంలో వేసిన వివిధ పంటలను సీఎం పరిశీలించారు.ఒకేచోట వివిధ రకాల మొక్కలు పెంచడంపై ఆరా తీశారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఐదు స్టాల్స్‌ను తిలకించారు రెండు గంటల సమయంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ పోతవరం రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలతో సమీక్షించారు. తొలుత చంద్రబాబు భూగర్భజలాలు, పంటల మార్పిడి, ఆదా యం, యంత్రాల వినియోగం, లాభసాటి వ్యవ సాయం, వ్యవసాయ అనుబంధ పంటల సాగు వంటి వాటి గురించి ప్రస్తావించారు. బాగా మాట్లాడిన రైతులను అభినందించడంతో



సభకు హాజరైన జనం

పాటు సేంద్రియ వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతులను సన్మానించారు. సభ ఏర్పాట్లు బాగా చేసినందుకు కలెక్టర్ కీర్తి చేకూరిని, నియోజక వర్గంలో బాగా

- మిగతా 8వ పేజీలో

రైతు కుటుంబానికి అండగా : ఎమ్మెల్యే మద్దిపాటి



సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతుకు ఆదాయం పెంచే విధంగా తమ ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకుని వచ్చి రైతు కుటుంబానికి అండగా ఉంటుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. బుధవారం నల్లజర్లలో జరిగిన సీఎం చంద్రబాబు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ 25 ఏళ్ల కిందట చంద్రబాబునాయుడు ఇంకుడు గుంతలు తవ్వండి, చెక్ డ్యాంలు కట్టండి అంటే ఎవరూ పెద్దగా పట్టించుకోలేదని, ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితిలో రైతులే ఇంకుడు గుంతలు కావాలంటున్నారని, చంద్రబాబు విజన్ ఇలా ఉంటుందని చెప్పారు. నదులను అనుసంధానం చేయడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, కొంగువారిగూడెం ప్రాజెక్టు నుంచి ఎర్రకాల్వ కుడికాల్వకు నీరు వదలడం ద్వారా ఏడు వేల ఎకరాల సాగు విస్తీర్ణం పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఎమ్మెల్యే తీసుకుని వచ్చారు.

సహకారం సమరం

ఈ నెల 6 నుంచి జనవరి 5 వరకు కార్యాచరణ

- డిమాండ్ల పరిష్కారానికి ఉద్యోగుల పోరాటం

ముదినేపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):తమ దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారానికి సహకార సంఘాల ఉద్యోగులు పోరుబాట పట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ జేఏసీ ఈ నెల 6 నుంచి జనవరి ఐదో తేదీ వరకు చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలను నాయకులు ప్రకటించారు. డీసీసీబీ పరిధిలోని ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 260 పీఏసీఎస్‌ల్లో 1,100 మంది ఉద్యోగులున్నారు. వీరిలో 260 మంది సంఘాల సీఈవోలు, 840 మంది ఇతర ఉద్యోగులు. ఆందోళనల్లో భాగంగా 6న నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు. 8న డీసీసీబీ బ్రాంచ్ కార్యాలయాల వద్ద, 16న జిల్లా సహకార శాఖాధికారి కార్యాలయాల వద్ద, 22న డీసీసీబీ ప్రధాన కార్యాలయాల వద్ద ధర్నాలు చేస్తారు. 29న విజయవాడలో మహాధర్నా, జనవరి 5 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. ఉద్యోగుల డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఆందోళన చేస్తామని జేఏసీ నేత బి.రఘురామ్ అన్నారు.

ఇవీ డిమాండ్లు

- జీవో 36 అమలు చేయాలి.
- ప్రతి ఐదేళ్లకు వేతన సవరణ జరగాలి.
- పెండింగ్ వేతన సవరణలపై చర్యలు తీసుకోవాలి.
- ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి.
- రూ.5 లక్షలకు తగ్గకుండా ఆరోగ్య బీమా కల్పించాలి.
- ఉద్యోగుల డ్యూటీ పద్దులను రద్దు చేయాలి.
- 2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి.
- 2011 నుంచి రైతులకు డివిడెండ్ చెల్లించాలి.
- నిబంధనల ప్రకారం ఉద్యోగులను బదిలీ చేయాలి.
- జీతాలను డీఎల్ఎస్ఎఫ్ ద్వారా చెల్లించాలి.
- సీనియార్టీ ప్రకారం ఉద్యోగులను సంఘాల సీఈవోలుగా నియమించాలి.

పరిశ్రమలొస్తున్నాయ్..!



కేరళ తరహాలో కార్వాన్ పార్కు

దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద జాతీయ రహదారి సమీపంలో ఇయాన్ సంస్థ టూరిజంకు అనుసంధానంగా రవాణారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుడుతూ పరిశ్రమన స్థాపనకు ముందుకొచ్చింది. ఈ సంస్థకు సొంతంగా ఉన్న 1.5 ఎకరాల స్థలంలో ఇంట్రిగేటెడ్ ట్రావెల్ హబ్ (కార్వాన్ పార్కు)ను ఏర్పాటు చేయనుంది. దీనికి ఏడు కోట్ల వ్యయం చేస్తామని.. తద్వారా 35 మంది ఉపాధి కల్పించనున్నట్టు తెలిపింది. కేరళ తరహాలో కార్వాన్ పార్కులో అత్యాధునిక వసతులను ట్రావెలర్స్‌కు కల్పిస్తారు. కాటేజీలు, వివిధ ఫ్యూయల్స్ నింపుకోవడంతో పాటు, బస్సుల్లోనే విడిది చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు.

- రూ.371 కోట్ల వ్యయంతో ఐదుచోట్ల స్థాపన.. 811 మందికి ఉద్యోగాలు
- విశాఖ పెట్టుబడుల సదస్సు సాధించిన ఘనత

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు విశాఖలో గత నెలలో 13,14 తేదీల్లో జరిగిన పెట్టుబడుల సదస్సు నాంది పలికింది. సొంత స్థలాలున్న పారిశ్రామికవేత్తలు ఐదుచోట్ల పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు చేసుకున్నారు. మొత్తం 371 కోట్లను పెట్టుబడులు పెడతామని, ఇందులో 811 మంది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆయా సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. అన్నీ సక్రమంగా జరిగి అనుమతులు, ఇతర లాంచనాలు పూర్తయితే ఏడాదిలోపే స్థానికంగా యువతకు ఉద్యోగ అవ కాశాలకు బాటలు వేయనున్నారు.

సీహెచ్ పోతేపల్లిలో పామాయిల్ రిఫనరీ

గత నెలలోనే ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌ను విస్తరించడానికి శ్రీకారం చుట్టింది. ఈ సంస్థ రూ.209 కోట్ల వ్యయంతో 66 మంది ఉపాధి కల్పించనుంది. ప్రధానంగా పామాయిల్ రిఫైనరీ, నాన్ డెయిరీ క్రీమర్ ప్యాట్స్, ఇతర ఉత్పత్తులను తయారు చేయనుంది. దీనికి కూడా పెట్టుబడుల సదస్సులో ఒప్పందం కుదుర్చుకున్నారు.

మరో మూడు పరిశీలన

అక్షోభ్య అనే సంస్థ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను రూ.30 కోట్ల వ్యయంతో స్థాపించి 450 మందికి ఉపాధి కల్పిస్తామని ముందు కొచ్చింది. సుధీష్‌రామ్ రెన్యువల్ ఎనర్జీ సంస్థ రెన్యువల్ ఎనర్జీ ఎక్విప్‌మెంట్ అసెబుల్డ్ తయారీ పరిశ్రమకు సిద్ధమైంది. రూ.50 కోట్ల వ్యయంతో 60 మంది ఉద్యోగాలను కల్పించనుంది. వీరు స్థల పరిశీలనలో ఉన్నారు. సాన్సో ఫార్మా రూ.75 కోట్ల వ్యయంతో 200 మందికి ఉపాధి కల్పించేందుకు ఫార్మా స్యూటికల్ డ్రగ్స్ కంపెనీని నెలకొల్పనుంది. దీనికి మూడెకరాలు సిద్ధంగా ఉన్నట్టు తెలిపింది. ఈ మూడు పరిశ్రమలకు సంబంధించి స్థలాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఇతర అనుమతులను జిల్లా యంత్రాంగం ఇవ్వాల్సి ఉంది. ఆయా సంస్థలు ఎక్కడ నెలకొల్పుతాయో అన్నది ఇంకా తేలాల్సి ఉంది.

కొత్త రేషన్ కార్డులిక సులువు

- దరఖాస్తులకు మార్గం సులభతరం చేసిన ప్రభుత్వం
- సచివాలయాల్లో మరిన్ని రేషన్ కార్డు సంబంధిత సేవలు

నేడు డీఎల్‌డీవోల కార్యాలయాలు ప్రారంభం

■ లోపలి పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కొండలరావు

వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ఐటీడీఏ ప్రత్యేక అధికారి కొండలరావు

బుట్టాయగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, జూనియర్, డిగ్రీ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న 6,684 మంది విద్యార్థుల ఆరోగ్యాల పట్ల అధికారులు, వార్డెన్లు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేఆర్‌పురం ఐటీడీఏకు గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి ఎల్.కొండలరావు ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో బుధవారం విద్యార్థుల ఆరోగ్య విషయాలపై ఆయన సమీక్షించారు. ప్రతి విద్యార్థికి హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేసి జేఎస్‌బీ నివాస్ (జ్ఞానభూమి సైట్)లో విద్యార్థి ఆరోగ్య విషయాలను పొందుపర్చాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యాల పట్ల ప్రొఫైల్‌ను సిద్ధం చేయడానికి వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తన పరిధిలోని ఆశ్రమ పాఠశాలలను సిబ్బందితో సందర్శించాలన్నారు. పీవో కె.రాములు నాయక్, డీడీ జగన్నాథరావు, ఈఈ లత, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సురేష్‌కుమార్, ఏటీడబ్ల్యూవోలు, డీవైఈవో, ఎంఈవో, హెచ్‌ఎంలు, వార్డెన్లు, పీఎంఆర్‌సీ, డీడీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్సిజన్ కొరత..చేపలు మృత్యువాత..

- వర్షాలతో చెరువుల్లో చల్లబడుతున్న నీరు
- ఖరీదైన మందులు వాడుతున్నా ఫలితం శూన్యం
- రైతులు నష్టాల బాట

కలిదిండి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):తుఫాన్ ప్రభావంతో మూడురోజులుగా కురు స్తున్న వర్షాల వల్ల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత ఏర్పడడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. కలిదిండి మండలంలో సుమారు 30 వేల ఎకరాల్లో రైతులు చేపల సాగు చేస్తున్నారు. మూలలంక, మట్టగుంట, భాస్కరరావుపేట, కొండగి, కలిదిండి, కొత్తూరు, సంతోషపురం గ్రామాల్లో చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి పెద్దసైజు చేపలు చనిపోతుండడంతో హడావిడిగా పట్టుబడి చేసి అయిన కాడికి అమ్ముకుంటున్నారు. చనిపోతున్న చేపలను స్థానికంగా వ్యాపారులు కొనుగోలు చేయక పోవడంతో ఏలూరు, ఆకివీడు మార్కెట్‌లకు తరలిస్తున్నారు. ఆక్సిజన్ కొరత నివారణకు ఖరీదైన మందులు వాడుతున్నా ఫలితం లేదని, ఎకరానికి రూ.2 లక్షలు చొప్పున పెట్టుబడి పెట్టామని, కనీసం పెట్టుబడులు రావడం లేదని వాపోతున్నారు.

పెదలంకకు చెందిన ముద్దం వీరాస్వామి 50 ఎకరాల్లో చేపల సాగు చేస్తుండగా ఆక్సిజన్ కొరత ఏర్పడి చేపలు మృత్యువాత పడడంతో సుమారు రూ.30 లక్షలు నష్టం వాటిల్లింది. సంతోషపురానికి చెందిన ఓ రైతుకు చెందిన 20 ఎకరాల చెరువులో చేపలకు శెంకుజలగవ్యాధి



పెదలంకలో హడావుడిగా పట్టుబడులు

సోకి చనిపోతున్నాయి. కొండంగిలో ఒక రైతుకు చెందిన 30 ఎకరాల చెరువులో ఆక్సిజన్ లోపించి చేపలు మృత్యువాత పడడంతో సుమారు రూ.25 లక్షలు నష్టం వాటిల్లింది. చేపల చెరువులకు బీమా సౌకర్యం కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఆక్వా రైతులు కోరుతున్నారు.

చేపల చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు హైట్రోజన్ పెరాక్సైడ్ ఎకరానికి కిలో చొప్పున చల్లాలని మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ తెలిపారు. చెరువుల్లో ఏరియేటర్లు నిరంతరాయంగా తిరుగుతూ ఉండాలన్నారు. ఉదయాన్నే బోటులను తిప్పుతూ ఆయిల్ ఇంజన్లతో నీటిని రీసైక్లింగ్ చేయాలన్నారు. మేతలు తక్కువగా వేయాలన్నారు.

బంగారు కుటుంబాలకు ఆర్థిక సహకారం

నిడమర్రు డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలకు మార్గదర్శులు తమ వంతు ఆర్థిక సహకారం అందించడంలో ముందుగు వేశారు. ఉంగుటూరు మండలం నల్లమాడులో సోమవారం జరిగిన సీఎం చంద్రబాబు సభలో పీ-4లో భాగంగా పారిశ్రామికవేత్త మనోజ్‌కుమార్ సొంకార్ బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆయన కుటుంబ సమేతంగా బుధవారం దత్తత కుటుంబాల వద్దకు వెళ్లి తొలిగా తనవంతు ఆర్థిక సహకారంగా నిత్యావసర సరుకులు, పిల్లలకు దుస్తులు అందజేశారు. నల్లమాడుకు చెందిన దత్తత కుటుంబ సభ్యులు శాఖమూరి వెంకటేశ్ దంపతులతో మాట్లాడుతూ మీ పిల్లలకు స్కూల్ ఫీజులు కడతానని, కుటుంబ సభ్యులు ఇద్దరికీ తమ ఫ్యాక్టరీలో ఉద్యోగం



వెంకటలక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న మార్గదర్శి మనోజ్‌కుమార్ సొంకార్ దంపతులు

కల్పిస్తామని హామీ ఇచ్చారు. రామచంద్రపురానికిచెందిన ఒంటరి మహిళ శ్రీరాముల వెంకటలక్ష్మీ ఇంటివెళ్లి ఆమెకు కొంత ఆర్థికసాయం అంద జేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వెల్లంపల్లి సుధీర్, సింగలూరి రామకృష్ణ, పాతూరి నాని, ఆచంట సత్యనారాయణ, నల్ల ఆనంద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం సానుకూలం

ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

■ లోపలి పేజీలో..

మేమొస్తున్నాం..!

- మెగా పీటీఎంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యేల ఆసక్తి

ఏలూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 1,728 ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించనున్న మెగా పేరెంట్-టీచర్ సమావేశానికి పలువురు ప్రజా ప్రతినిధులు హాజరయ్యేందుకు జిల్లా విద్యాశాఖకు సమాచారమిచ్చారు. బుధవారం సాయంత్రం వరకు అందిన వివరాల ప్రకారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి నగరంలోని కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కొప్పాక జడ్పీ హైస్కూలు, ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు పెదనింద్రకొలను జడ్పీ హెచ్‌ఎస్, మంత్రి కొలుసు పార్థసారథి మచిలీపట్నంలో మెగా పీటీఎంలో పాల్గొనేందుకు అంగీకారం తెలిపారు. కలెక్టర్, మిగతా ఎమ్మెల్యేలు ఖరారు చేయాల్సి ఉందని సమగ్రశిక్ష సీఎంవో డి.యెహోషువ తెలిపారు. కాగా మెగా పీటీఎంను నిర్వహించడానికి డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం జిల్లాలోని ఎంఈవోలతో వెబెక్స్ సమావేశం నిర్వహించగా, కలెక్టర్ వెట్రిసెల్వి అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఎంఈవోలతో సమావేశమై సూచనలు చేశారు. మెగా పీటీఎంకు హాజరయ్యే పేరెంట్స్ ఫోన్లలో లీప్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలని కోరారు. గతంలో స్కూలులో చదువుకుని ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో వున్న పూర్వ విద్యార్థులను సమావేశానికి ఆహ్వానించి, వారితో ప్రసంగం ఇప్పించడం ద్వారా బాల బాలికల్లో స్ఫూర్తిని నింపాలన్నారు.

కష్టపడి పనిచేస్తే పదవులు అవే వస్తాయి

గోపాలపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో సీఎం చంద్రబాబు


సీఎం సభలో మాట్లాడుతున్న మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పార్టీకి కార్యకర్తలే బలం. అలాంటి కార్యకర్తలను నాయకుడే కాపాడుకోవాలి. ప్రతి కార్యకర్త బాగోగులు చూసుకునే బాధ్యత నాదే. కష్టపడి పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయని సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో బుధవారం జరిగిన టీడీపీ గోపాలపురం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. నిస్వార్థంగా శ్రమించే కార్యకర్త ఉన్నంతకాలం తెలుగుదేశం పార్టీకి తిరుగులేదన్నారు. నియోజకవర్గంలో కష్టపడి పనిచేసే నాయకుడు ఉన్నప్పుడే ఆ నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, గోపాలపురం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి ప్రస్తుతం బేషుగ్గా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పార్టీ పట్ల విధేయత, గౌరవం ఉన్న వ్యక్తి అని, ఆయన నాయకత్వంలో గడిచిన రెండేళ్లలో పార్టీ ఏకతాటిపై నడుస్తోందన్నారు. నియోజకవర్గానికి సమర్థుడైన అభ్యర్థినే ఎంపికచేసి పంపించానని, మీ ఆశీస్సులతో గెలిపించి అసెంబ్లీకి పంపించారని, ఇది కార్యకర్తల విజయమేనన్నారు. పేద రికాన్ని నిర్మూలించడానికి పీ4 విధానం ప్రవేశపెట్టామన్నారు. కార్యకర్తలకు రక్షణగా ఉండడానికి పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రమాద బీమా కల్పిస్తున్నామన్నారు. గతంలోనూ పెద్దదిక్కు కోల్పోయిన కుటుంబాలకు టీడీపీ అండగా ఉందన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా పార్టీ ఆదుకుంటుందన్నారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడారు. అనంతరం కార్యకర్తలతో చంద్రబాబు సెల్ఫీ ఫోటోలు దిగారు.

ఘనంగా భక్తాంజనేయ ఉత్సవాలు

నందమూరు గరువులో భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద 60వ వార్షికోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం కొప్పనీడి శ్రీనివాసరావు లక్ష్మీకృష్ణకుమారి దంపతులచే కలశ స్థాపన చేసి పూజలు చేశారు. ఏపీ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు పాల్గొని పూజలు చేసి స్వామివారి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో అలంకరించిన వాహనంలో సీతారామచంద్ర స్వామి వారితో కలిసి గ్రామోత్సవం ముందుకు సాగింది. బాణ సంచాకాల్పులతోపాటు, రామం దండు, మహిళల నృత్యాలు అఘోరాతో పరమేశ్వరుడు, శక్తి వేషాలతో పాటు గుర్రాల నృత్యాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయం నుంచి బయల్దేరిన ఉత్సవం వీరవాసరం వరకు సాగింది. అక్కడి నుంచి శృంగవృక్షం వరకు సాగి తిరిగి ఆలయానికి చేరింది. సాయంత్రం వేదిక పై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- వీరవాసరం,(భీమవరం టౌన్), ఆంధ్రజ్యోతి


ప్రత్యేక అలంకరణలో స్వామి వార్లు


ఆకట్టుకున్న వేషధారణలు





రైతు చేతిలో వ్యవసాయ ప్రపంచం

రాష్ట్రంలో వ్యవసాయం లాభసాటిగా మార్చి రైతన్నల ఆదాయం పెరిగి జీవన ప్రమాణాలు పెంచేలా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన పంచ సూత్రాలను రైతులకు వివరించేందుకు ఉద్దేశించిన రైతన్న మీకోసం కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నది. దీని కోసం రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్ ఏపీఏఐఎం 2.0 (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం) ద్వారా వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలు, పంటల వివరాలు, తెగుళ్ల నివారణ, వాటికి అవసరమైన పురుగు మందుల వివరాలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో పాటు పంటల మార్కెటింగ్ వివరాలు రూపొందించారు. వాటి ద్వారా పంటలకు సాంకేతికతను జోడించి సాగు ఖర్చులను తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమం గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతున్నది.

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మొబైల్ యాప్‌తో రైతుకు మేలు



అత్తిలిలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి (ఫైల్ ఫొటో)

తణుకు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ, దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు, సిబ్బందితో పాటు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధుల రైతుల ఇంటి వద్దకే వెళ్లి ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ సంస్కరణలు వివరించి, ప్రభుత్వం రూపొందించిన నూతన యాప్‌ను రైతుల మొబైల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వ్యవసాయంలో సాంకేతికత ఆధారంగా సాగు ఖర్చును తగ్గించాలని, దీనితో పాటు ప్రకృతి సేద్యాన్ని రైతులలో ప్రోత్సాహించాలని, రైతులు పండించిన పంటలకు మరింత విలువలు పెంచి అంతర్జాతీయ స్థాయి మార్కెట్‌లో మన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర పలకాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈకార్యక్రమం చేపట్టింది. రైతుల వ్యక్తిగత తాలూకా సాగు సమస్యలు, యంత్ర పరికరాల లభ్యత వివరాలు, రైతులకు కావలసిన పరికరాల వివరాలను తెలుసుకోవడంతో పాటు రాబోయే కాలంలో లాభసాటి వ్యవసాయానికి కావలసిన అవసరాలను తెలుసుకోవడం, రాబోయే మూడు సీజన్‌లకు ముందస్తు ప్రణాళికలను తయారు చేసుకోవడం కోసం రైతులకు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని వివరించడం కోసం రైతన్న మీకోసం కార్యక్రమం చేపట్టింది. సర్వేతో కూడిన ఈకార్యక్రమంలో సేకరించిన డేటాను కన్సాలిడేట్ చేసి గ్రామాల్లోని ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో గ్రామ సభను ఏర్పాటు చేస్తారు. దీని ప్రకారం రాబోయే మూడు సీజన్లు అంటే రబీ, ఖరీఫ్, రబీలలో రైతులు అను సరించవలసిన ముందస్తు పంటల ప్రణాళికను రైతుల సమక్షంలోనే తయారు చేస్తారు.

భాగస్వాములయ్యేది వీరే...

రైతన్న మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ శాఖలోని విలేజ్ వ్యవ సాయ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్, విలేజ్ రెవిన్యూ ఆఫీసర్, విలేజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్, విలేజ్ ఎనర్జీ అసిస్టెంట్, ఏపీ సీఎస్ఎఫ్ సిబ్బంది, పీఏసీఎస్ మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొంటారు. ఈ యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేయడం ద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల పూర్తి సమాచా రం ఈ యాప్‌లో వుంటుంది. ఎప్పటికప్పుడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, ప్రధాన మంత్రి పసల్ బీమా యోజన, ఈ క్రాప్, వ్యవసాయ యాంత్రీకరణ, ఇతర పథకాలకు అవసరమైన సమాచారం ఇందిలో వుంటుంది.

కార్యాలయాలు చుట్టూ తిరిగే పనిలేదు



ఈ యాప్‌తో అన్ని సేవలు రైతుల చేతుల్లోని మొబైల్‌లో అందుబాటులోకి వచ్చాయి. దీనితో రైతుకు సంబంధించిన పంట ఈకేవైసీ చేసిందీ, లేనిదీ రైతు ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు రైతే స్వయంగా నమోదు చేసుకోవచ్చు. దీని వలన రైతు తమ పంటలకు సంబంధించిన వివరాల నమోదు కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని తగ్గింది.

-వైవీవీ సత్యనారాయణ, రైతు మండపాక

4748 మంది రైతుల మొబైల్‌లలో యాప్



మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలోని 4748 మంది రైతులను వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బంది కలసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన పంచ సూత్రాలను వివరించారు. ఈకార్యక్రమంలో ఆండ్రాయిడ్ మొబైల్ ఉన్న ప్రతి రైతుకు ఏపీఏఐఎం 2.0 (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టం) యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు.

- కె.రాజేంద్ర ప్రసాద్, వ్యవసాయాధికారి, తణుకు


కొత్త రేషన్ కార్డులిక సులువు



- దరఖాస్తులకు మార్గం సులభతరం చేసిన ప్రభుత్వం
- సచివాలయాల్లో మరిన్ని రేషన్ కార్డు సంబంధిత సేవలు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గం సులభతరం చేసింది. గతంలో కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే సంవత్సరంలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే గ్రామ, వార్డు సచివాలయాలకు అవకాశం ఇచ్చేది. దీంతో ప్రజలు ఎదురు చూడాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేషన్ కార్డుకు సంబంధించి కొత్తగా మరిన్ని సేవలను అందుబాటులోకి తెచ్చింది. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు, కార్డు విభజన, అడ్రస్ మార్పులు, రేషన్‌కార్డు సరెండర్, పిల్లలు, భార్య ను కార్డులో చేర్చడం, మృతి చెందిన, ఇతరుల పేర్లు తొలగింపు ప్రక్రియ ఆరు నెలలుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో జరుగుతూనే ఉంది. రేషన్ కార్డులకు సంబంధించి ప్రజలకు అవస రమైన సేవలను పొందడానికి అవసరమైన పత్రాలతో పాటు ఆయా సచివాలయాల్లో సేవలందించినందుకు స్వల్ప రుసుం చెల్లింపు తప్పనిసరి. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత వీఆర్వోలు ఆ దరఖాస్తును పరిశీలించి కావలసిన పత్రాలను దరఖాస్తుదారుల నుంచి సేకరించి పరిశీలన నిమిత్తం తహసీల్దారు కార్యాలయానికి పంపుతారు. తహసీల్దార్ ధ్రువపత్రాలను పరిశీలించి అన్నీ సరిగా ఉంటే మంజూరు చేస్తారు లేదంటే తిరస్కరిస్తారు.

- **కొత్త రేషన్ కార్డుకు అవసరమైన పత్రాలు**
  1. దరఖాస్తు ఫారం
  2. కుటుంబ సభ్యులందరి ఆధార్
  3. దరఖాస్తు రుసుము రూ.24
- **కార్డులో పిల్లల్ని చేర్చడానికి..**
  1. దరఖాస్తు ఫారం
  2. పుట్టిన తేదీ సర్టిఫికెట్
  3. చైల్డ్ ఆధార్ జిరాక్స్ (కార్డులో చేర్చే వారిది మాత్రమే)
  4. తల్లి, తండ్రి ఆధార్ జిరాక్సులు
  5. రేషన్‌కార్డు జిరాక్స్
  6. దరఖాస్తు రుసుము రూ.24
- **భార్య పేరు చేర్చేందుకు..**
  1. దరఖాస్తు ఫారం
  2. భార్యాభర్తల ఆధార్ జిరాక్స్‌లు
  3. రేషన్‌కార్డు జిరాక్స్
  4. దరఖాస్తు రుసుము రూ.24
- **అడ్రస్, రేషన్ షాపు మార్పునకు..**
  1. దరఖాస్తు ఫారం
  2. యజమాని ఆధార్‌కార్డు జిరాక్స్
  3. యజమాని ఈకేవైసీ
  4. దరఖాస్తు రుసుము రూ.24
- **రేషన్ కార్డు విభజన కోసం**
  1. దరఖాస్తు ఫారం
  2. ఆధార్ జిరాక్స్ కాపీలు కుటుంబ సభ్యులందరివి
  3. దరఖాస్తు రుసుము రూ.48
- **కార్డు సరెండర్ కోసం..**
  1. దరఖాస్తు ఫారం
  2. యజమాని ఆధార్‌కార్డు జిరాక్స్
  3. రేషన్‌కార్డు జిరాక్స్
  4. దరఖాస్తు రుసుము రూ.24
- **సభ్యుల తొలగింపు కోసం..**
  1. దరఖాస్తు ఫారం
  2. మృతుడి ఆధార్
  3. మృతుడి మరణ ధ్రువీకరణ పత్రం
  4. దరఖాస్తు రుసుం రూ.24
- **పేరు, తప్పులు సరిచే సేందుకు..**
  1. దరఖాస్తు ఫారం
  2. పేరు తప్పు పడిన వారి ఆధార్ జిరాక్స్
  3. రేషన్‌కార్డు జిరాక్స్
  4. దరఖాస్తు రుసుము రూ.24


రేషన్‌కార్డు దరఖాస్తు

యాంత్రీకరణతో లాభసాటి వ్యవసాయం

మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణతో వ్యవసాయం లాభదాయకమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నెక్కలం గొల్లగూడెంలో బుధవారం రైతన్నా.. మీ కోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కూలీల కొరత ఎక్కువగా ఉన్నందున యాంత్రిక శక్తి ఉపయోగించుకోవాలని కోరారు. రైతులకు రోటావేటర్, డ్రోన్, ట్రాక్టర్లు, వ్యవసాయ పని ముట్లు ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగు చేస్తే నీటి వినియోగం తగ్గి లాభసాటిగా ఉంటుందన్నారు. వరిపంటను తగ్గించి పామాయిల్, కోకో, మొక్కజొన్న లాంటి వాణిజ్య పంటలు సాగుచేస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. అంతర్ పంట కూడా వేసి రైతులు లాభాలు గడించవచ్చన్నారు.

పరిమెళ్ళలో తాగునీరు వృథా



పరిమెళ్ళ గ్రామంలో వాటర్ ట్యాంకుల్లోకి తాగునీరు ఎక్కించే క్రమంలో అది నిండిపోయి కిందకు వృథాగా నీరు పోతున్నా కనీసం ఆపుచేయడం లేదు. దీనిపై స్థానికులను ఆరా తీయగా చాలా సార్లు ఇదే విధంగా నీరు వృథాగా పోతుందని చెబుతున్నారు.

- పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

మురుగునీరు వస్తున్న కుళాయికి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాలకోడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుళాయిల ద్వారా మురుగునీరు- లబోదిబోమంటున్న శృంగవృక్షం వడ్డీలవారి వీధి వాసులు అంటూ ఆంధ్రజ్యోతిలో ఈ నెల 1న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆంధ్రజ్యోతి కథనాన్ని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు సైతం చూసి పంచాయతీ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో ఒక చోట పంచాయతీ సరఫరా చేస్తున్న కుళాయిలో మురుగునీరు కలుస్తుందని గమనించి ఆ ప్రదేశాన్ని తవ్వి మరమ్మతులు చేపట్టారు. పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి కనుమూరి వెంకట్రాజు పర్యవేక్షించారు. కాలనీ వాసులు సైతం ఆంధ్రజ్యోతిలో కథనంతోటే అధికారులు స్పందించారంటూ హర్షం వ్యక్తం చేశారు.

వర్షంతో ధాన్యానికి దెబ్బ

నెమ్ము ధాన్యంగా విక్రయాలు.. అక్కడక్కడా ధాన్యం మొలకలు



భీమవరం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాన్ రైతులకు నష్టాలు, కష్టాలు చూపించింది. చక్కగా సాగుతున్న పంట మాసూళ్లకు అడ్డుకట్ట వేసింది. గట్లకు చేరిన ధాన్యం మొలకలు ధాన్యం నెమ్ముతో పొడి రావడం జరుగుతుంది. దీంతో రైతులలో అలజడి మొదలైంది. జిల్లాలో ధాన్యంగా ఉన్న 30 వేల టన్నులలో ఎక్కువగా ధాన్యం రాశులుగా ఉన్నాయి. వాటిని భద్రపరిచేందుకు ఎండుగడ్డి లేనందున బరకాలు మాత్రమే వాడుతున్నారు. అధిక వర్షాలు పడినచోట పైనుంచి రాశి కింద నుంచి వర్షపు నీరు చేరింది. ఆ రాశుల్లో ధాన్యం మొలకలు వచ్చాయి. మబ్బుల వాతావరణంలో మాసూళ్ళయి ఎండబెట్టడానికి వీలులేని ధాన్యంలో తేమ ఉండిపోయింది. అదివేడిగా మారడంతో ధాన్యం రంగు మారుతుంది. దీంతో రైతులు మేఘాలలో వాటిని ఆరబెట్టారు. మరికొంత మంది రైతులు తేమ శాతం ధరకే అంటే బస్తారూ200 తక్కువకే విక్రయిస్తున్నారు. మొలకలు వస్తే ధాన్యం కొనుగోలు ఇబ్బందిగా మారుతుంది. వర్షాలు ధాన్యంకే పెద్ద దెబ్బగా మారింది.

మానుగాయితో అంతా నష్టం

సార్వా చేలు ఈనిక దశలో మొంథా తుఫాన్ వర్షాలు పడటంతో ధాన్యం గింజకు మానుగాయి ఏర్పడింది. కొన్ని చేలకు ఎండ తెగులు వచ్చింది. వీటి వలన పంట దిగుబడి ఎకరానికి 20 బస్తాలు లోపుగా మారింది. ఎండాకు తెగులు వల్ల గింజ సరిగా పోసుకోలేదు. మానుగాయి వల్ల దిగుబడి తగ్గిపోవడం, కొనుగోలు చేసిన మిల్లర్లకు బియ్యం దిగుబడిరాదు. మానుగాయి వచ్చిన గింజ జల్లెడలో దిగకుండా పొట్టులోకి పోతుంది. రైతు మిల్లర్లకు నష్టంగా మారింది.


భీమవరం మండలంలో మొలకెత్తిన ధాన్యం.. పెనుమంట్ర మండలం వెలగలేరులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేశాం

పెనుమంట్ర, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగిందని, రైతులు ఆర్ఎస్కేలను ధాన్యం అమ్మకాలకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వెలగలేరు గ్రామపంచాయతీ పరిధిలోని మార్టేరు బ్రాహ్మణ చెరువు ప్రధాన రహదారిపై నిల్వ చేసిన ధాన్యం రాశులను కలెక్టర్ బుధవారం పరిశీలించి కొద్ది సమయం రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ గోనెసంచుల నాణ్యత, ధాన్యం రవాణా సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, రైతు సేవా కేంద్రాల పనితీరు, అధికారుల అందుబాటు సేవలు పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లుల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా తక్షణమే స్థానిక అధికారులకు తెలియజేయాలని ఆమె సూచించారు. దళారీలను నమ్మి మోసపోవద్దని రైతులను హెచ్చరించారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, నాణ్యమైన సేవలే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందని ఈ సందర్భంగా రైతులకు తెలిపారు.

క్రీడల్లో సీఆర్ఆర్ విద్యార్థుల ప్రతిభ


ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన వారిలో సీఆర్ఆర్ విద్యార్థులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సిద్ధార్థ విద్యా సంస్థల్లో నిర్వహించిన ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ట్రోఫీని గెలుచుకున్నారని స్కూలు కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, ప్రిన్సిపాల్ సాయికుమారి తెలిపారు.

● పల్నాడులో ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ సెలక్షన్స్‌లో సీనియర్స్ విభాగంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ఏలూరు సీఆర్ఆర్ అటానమస్ కళాశాల డిగ్రీ విద్యార్థులు ఎం.ధనగణేష్, జి.జితేంద్ర, జి.ఎనోష్, ఆర్.శ్రీరామ్ ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ తెలిపారు. అండర్-19 జూనియర్స్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించడంలో కె.హేమంత్ కుమార్ కీలకపాత్ర వహించాడని వివరించారు.

జాతీయ స్థాయి పోటీలకు టి.నరసాపురం విద్యార్థులు



టి.నరసాపురం: జాతీయ స్థాయి క్రికెట్, రగ్బీ పోటీలకు టి.నరసాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ ఎం బీఎల్ స్వామి తెలిపారు. ఇటీవల కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ అండర్-14లో ఎంపికైన కాసగాని సాయి దీపక్, బి.పవన్, రగ్బీ అండర్-17 విభాగంలో బి.దయాకర్ త్వరలో జమ్మూ కాశ్మీర్, ఒరిస్సా రాష్ట్రాల్లో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీడీ అడపా రామకృష్ణను పలువురు అభినందించారు.



పది పరీక్షలకు పక్కా ప్రణాళిక

భీమవరం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ప్రభుత్వం, అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యా శాఖ అడుగులు వేస్తుంది. కార్యాచరణ రూపొందించి విద్యార్థులకు మెటీరియల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ నెల 6 నుంచి వంద రోజుల ప్రణాళికగా నడవనున్నారు.

వంద రోజుల ప్లాన్‌లో మార్పులు

ఈసారి టెన్త్ విద్యార్థుల ఉత్తీర్ణతపై దృష్టి పెట్టి విద్యాశాఖ వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో కొన్ని మార్పులు తీసుకొచ్చింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే 12,890 విద్యార్థుల ఉత్తీర్ణత లక్ష్యంగా పెట్టుకున్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉత్తీర్ణులు చేసే దిశగా బోధన ప్లాన్ రూపుదిద్దారు. ముందుగా ఏ, బీ, సీ, డీ నాలుగు కేటగిరీలుగా విద్యార్థులను విభజిస్తారు. ఏ, బీ లను వంద రోజుల ప్లాన్‌లో నడిపిస్తారు. సీ విద్యార్థులపైన ప్రత్యేక ఫోకస్ పెడతారు. ఇక డీ కేటగిరీ బాగా డల్లర్ విద్యార్థులుగా నిర్ణయించారు. వీరిలో ముగ్గురు విద్యార్థులను ఒక ఉపాధ్యాయునికి అప్పగిస్తారు. ఆ సబ్జెక్టులో వారిని ముందుకు తీసుకువచ్చేలా బాధ్యతలు అప్పగిస్తారు. దీనివల్ల ఫెయిల్ ప్లేస్‌లో ఉన్నా వీరు ఉత్తీర్ణత బాట పడతారు. ఇక నుంచి విద్యార్థులకు ప్రతి రోజు బోధన పూర్తయ్యాక వాటిపై పరీక్ష నిర్వహిస్తారు. గత ఏడాది వారానికి ఒకసారి పరీక్ష పెట్టారు దానిలో మార్పు తెచ్చారు. రోజు పూర్తయిన పరీక్షలో విద్యార్థుల ప్రతిభ వివరాలు ఒక మ్యాప్‌లో పొందుపరచాలి.

రేపు పేరెంట్స్, ఉపాధ్యాయ మీటింగ్‌లో చర్చ

ఈ నెల 5న జరగనున్న మెగా పేరెంట్, ఉపాధ్యాయ మీట్‌లో టెన్త్ విద్యార్థుల ప్రతిభపైన తల్లిదండ్రులతో చర్చ జరగనుంది. ఎస్ఏ పరీక్షలలో విద్యార్థులకు వచ్చిన మార్కులు బట్టి ప్లాన్ రూపుదిద్దనున్నారు. టెన్త్ విద్యార్థుల ప్రొగ్రెస్ రిపోర్ట్ క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థికి ఏవిధంగా బోధన అవసరంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్ణయానికి రావాల్సి ఉంది.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి కాగా రేపటికి 100 రోజులు ఉంది. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిలవాలనే ప్రణాళిక నడుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో చివరి మూడు సంవత్సరాలు ప్రభుత్వ విద్యార్థులు టెన్‌లో 50 శాతం లోపు ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేట్ వారు 90 శాతం పైన ఉన్నారు. గత ఏడాది 70 శాతం ఉత్తీర్ణతగా ప్రభుత్వ విద్యార్థులు నిలిచారు. ప్రైవేట్ విద్యార్థులు 90 శాతంగా ఉత్తీర్ణత సాధించారు. 2025-26 విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత వైపు ప్రభుత్వ విద్యార్థులు నడిచేలా ప్రణాళిక ఏర్పాటు చేశారు.

6 నుంచి 100 రోజుల కార్యాచరణ అమలు



భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ ప్రారంభించండి



రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వినతిపత్రమిస్తున్న ఎంపీ మహేశ్

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం -కొవ్వూరు రైల్వేలైన్, ఆర్వోబీ పనులను ప్రారంభించి త్వరితగ తిన పూర్తి చేయాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీలో రైల్వే మంత్రిని బుధవారం కలసి రాష్ట్ర సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎంపీ మహేశ్ మాట్లాడుతూ భద్రాచలం- కొవ్వూరు రైల్వేలైన్‌కు 100 శాతం రైల్వే నిధులు కేటాయించాలని కోరామన్నారు. 11 ఆర్వోబీలకు కేంద్రం అనుమతి ఇచ్చినా పనులు మొదలు కాలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

రొయ్యల వినియోగాన్ని ప్రోత్సహించాలి



రాజ్యసభలో మాట్లా డుతున్న ఎంపీ పాకా

భీమవరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మన ఆక్వా ఉత్పత్తులకు అంతర్జాతీయ ఎగుమ తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో ఆత్మనిర్భారత్ పథకంలో మన రొయ్యలను స్థానిక వినియోగానికి ప్రోత్సాహం కల్పించాలని, దీనివల న ఆక్వారైతులు ఎగుమతుల సంక్షోభాలను అధిగమించటానికి వీలుంటుందని రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ అన్నారు. రాజ్యసభ సమావేశాలలో బుధవారం ఆక్వా రైతుల సమ స్యలపై ప్రసంగించారు. ముఖ్యంగా రొయ్యలు చేపల ఎగుమతులకు ఉన్న అవరోధాలను అధిగమిం చడానికి ఆయన కొన్ని సూచనలు చేశారు. ప్రస్తుతం మన ఆక్వా మార్కెట్ అంతర్జాతీయంగా 75 శాతం వాటాతో గ్లోబల్ లీడర్‌గా ఉందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 70 శాతం వాటా ఉందన్నారు. కొంతకాలంగా మన వ్యాపా రంపై అమెరికా వాణిజ్య ఆంక్షలు విధించిన నేపథ్యం లో అంతర్జాతీయంగా మన ఆక్వా ఎగుమతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. రోజువారి ఆహారంలో ఆక్వా ఉత్పత్తులు తినడం చాలా ఆరోగ్యకరమన్నారు. వీటిని తీసు కోవడం వల్ల శరీరానికి మంచి ప్రోటీన్ అందుతుందన్నారు. అందువలన ప్రధానంగా రక్షణ శాఖలో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ లాంటి డిఫెన్స్ విభాగంలో ఉన్న క్యాంటీన్లకు ఈ ఆక్వా ఉత్పత్తులను చేర్చాలని, దీనికి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే విద్య శాఖకు సంబంధించి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి, అంగన్‌వాడీ విద్యార్థులకు పోషక ఆహారంలో భాగంగా ఆక్వా ఉత్పత్తులను అందించవచ్చు అన్నారు.

ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్టులు పూర్తిచేయాలి



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాజెక్ట్ ల పనితీరుపై శాసనసభ పబ్లిక్ అ కౌంట్స్ కమిటీ నిర్వహించిన సమీ క్షా సమావేశంలో కమిటీ సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ పాల్గొన్నారు. అమరావతిలోని అసెంబ్లీ సమావేశ మందిరంలో నిర్వ హించిన సమావేశాన్ని నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ సభ్యులు, అధికారులు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్ట్‌లపై సమీక్ష చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్ వివరాలు, ఖర్చులు పరిశీలించారు. ముఖ్యమైన వాటిని ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేయాలని సభ్యులు కోరారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తు చేయండి

ఏలూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. జిల్లాలో భర్తీ చేసే స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు నెలకు రూ.12,500లు గౌరవ వేతనంగా చెల్లిస్తారని వివరించారు. ఏలూరు 7వ డివిజన్ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూలులో ఒక ఉర్దూ పోస్టు, మౌలానా అబుల్ కలాం అజాద్(మాకా) హైస్కూలులో ఉర్దూ, భౌతిక శాస్త్రం, గణితం పోస్టులు, కైకలూరు మండలం ఆటపాక జడ్పీ హైస్కూలులో సంస్కృతం, కలిదిండి మండలం మట్టగుంట జడ్పీ హైస్కూలులో హిందీ, నూజివీడు మండలం ముక్కొల్లుపాడు మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూలులో జీవశాస్త్రం పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సంబందిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 5వ తేదీలోగా అక్కడే దరఖాస్తులను అందజేయాలని కోరారు. దరఖాస్తు ఫారం నమూనా ఎంఈవో కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

ఏలూరు టూటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):శబరిమలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్‌లో ప్రత్యేక రైళ్ల గురించి ఎంపీ మహేశ్ అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి అశ్వీని వైష్ణవ్ స్పందించారు. విశాఖపట్నం నుంచి 20, కాకినాడ నుంచి 18 ప్రత్యేకరైళ్లు శబరిమలకు ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్వీని వైష్ణవ్ తెలిపారు.

ఆదివాసి అంధ క్రికెటర్‌కు అభినందన



ఆర్థిక సహాయం అందిస్తున్న ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరి

పోలవరం డిసెంబరు, 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన తొలి మహిళా ప్రపంచ అంధుల క్రికెట్ కప్ పోటీలలో భారత జట్టు విజయం సాధించడంతో కీలకపాత్ర పోషించిన ఆదివాసి అంధ మహిళా క్రికెటర్ కరుణకుమారిని బుధవారం ఏపీ స్పోర్ట్స్ అథార్టీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ దేశ గౌరవాన్ని నిలబెట్టిన ఆదివాసి మహిళా క్రికెటర్ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన మహిళా క్రికెటర్‌కి 20 వేల రూపాయలు పోత్సాహకంగా అందజేశారు.

వాలీబాల్ విజేత: డీఆర్‌జీ కళాశాల



కప్ సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

పెంటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని ప్రిన్సి పాల్ డాక్టర్ ఎన్. వెంకటే శ్వరరావు అన్నారు. నరసా పురం వైఎన్ కళాశాలలో జరిగిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, కప్పు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా మెడల్ సాధించిన విద్యార్థులను, విజయంలో కృషి చేసిన స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ విజయబాబు, అంజిబాబులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు తెలిపారు.

ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలం



మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

భీమవరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల డిమాండ్స్ గత ప్రభుత్వం నుంచి పేరుకుపోయాయని, ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడానికి ఏపీ ఎన్జీవో సంఘం బాధ్యత తీసుకున్నదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. భీమవరంలో జిల్లా ఏపీ ఎన్‌జీవోల అసోసియేషన్ అడహక్ కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్న సందర్భంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటంలో సుముఖంగా ఉందని, అందులో భాగంగా సుమారు రూ.11వేలకోట్లు ఉద్యోగుల ఖాతాల్లో జీపీఎఫ్ తదితర సొమ్ములు పడ్డాయని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు సుమారు రూ.3,200 కోట్లు ప్రాన్ అకౌంట్స్‌లో జమ చేసేలా ఏపీ ఎన్జీవో సంఘం కృషి చేసిందన్నారు. హెల్త్‌కార్డ్ సరిగా వినియోగంలోకి రావటం లేదని దీని వలన ఉద్యోగవర్గం తీవ్రంగా నష్టపోతున్నారని,ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ, చోడగిరి శ్రీనివాసరావు, నెరుసు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవోల జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక

ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు జిల్లా సంఘం అడహక్ కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా ఉదిసి వెంకట పాండురంగారావు, కన్వీనర్‌గా పోతన సుకుమార్, కో- చైర్మన్‌గా అల్లూరి శ్రీనివాస రాజు, కో-కన్వీనర్లుగా ఎంఆర్‌కె రాజు, దేవాబత్తుల నాగ దేవి, ఇంజేటి రమేష్, సుంకర వెంకటేష్‌లను ప్రకటిచారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెనుమరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు శివ ప్రసాద్, రాం ప్రసాద్, జేఏసీ నాయకులు ఆర్ఎస్ హరనాథ్, రాష్ట్ర ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా భీమవరం పాత బస్ స్టాండ్ నుంచి బైక్ ర్యాలీగా త్యాగరాజ భవన్ వరకు సాగింది.

నేడు డీఎల్‌డీవో కార్యాలయాల ప్రారంభం

ఏలూరు సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయటానికి, డివిజన్‌స్థాయిలో పంచాయతీరాజ్ కార్యకలాపాలు నిర్వహించటానికి డీఎల్‌డీవో కార్యాలయాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాల్లో ప్రత్యేకంగా డివిజనల్ స్థాయిలోని అధికారులు పాలన నిర్వహిస్తారు. పంచాయతీ కార్యకలాపాలతో పాటు, ఉపాధి హామీ కార్యకలాపాల నిర్వహణను ఈ కార్యాల యాల ద్వారా డివిజినల్ స్థాయి అధికారులైన డీడీవో, డీఎల్‌డీవో, డ్వామా ఏపీడీలు దిగువ స్థాయిలో జరిగే కార్యక్రమాలను పర్యవేక్షణ చేయటం జరుగుతుంది. ఈ డీఎల్‌డీవో కార్యాలయాలను ఈనెల 4వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ పర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులలోను, పశ్చిమగోదావరి జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలలోను, తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరులోను ఈ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఈ కార్యాలయాల నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు 67 లక్షలు రూపాయలు కేటాయించారు. ఇప్పటివరకు జిల్లాలో డివిజన్ స్థాయిలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఆర్డీవో కార్యాలయం, పోలీస్ శాఖకు సంబంధించి డీఎస్పీ కార్యాలయం ఉండేవి. తాజాగా పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి డివిజినల్ స్థాయి కార్యాలయాలు ఏర్పాటు అయ్యాయి.

డీఎల్‌డీవో కార్యాలయాల ప్రారంభోత్స వాన్ని గ్రామ పంచాయతీల్లో ప్రజలు వీక్షించటానికి ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని వీక్షించటానికి ఏర్పాట్లు చేశారు.

డీడీవో అధికారులు వీరే

పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నూతనంగా నిర్మితమైన డీఎల్‌డీవో కార్యాలయాలకు డీడీవోలుగా పనిచేస్తున్న అధికారులు వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు డీడీవోగా ఏబీవీవీ లక్ష్మి, జంగారెడ్డిగూడెం డీడీవోగా ఎం. రాజు, నూజివీడు డీడీవోగా పి.వెంకటరత్నం, భీమవరం డీడీవోగా వై.దోసిరెడ్డి, నరసాపురం డీడీవోగా జి.రాణి, తాడేపల్లిగూడెం డీడీవోగా ఎం.ప్రభాకరరావు, కొవ్వూరు డీడీవోగా ఏఎస్ రెడ్డి పనిచేస్తున్నారు. డీడీవోల ఆధ్వర్యంలోనే ఈ కార్యాలయాలు పనిచేయటం జరుగుతుంది. పంచాయతీరాజ్ కార్యకలాపాలను వికేంద్రీకరించటానికి ఈ డివిజినల్ వ్యవస్థ దోహదపడుతుందని చెబుతున్నారు.

సమస్యలకు సాంకేతిక పరిష్కారాన్ని కనుగొనాలి

ఏపీ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధుమూర్తి

భీమవరం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజంలో సమస్యలు గుర్తించి వాటికి సరైన సాంకేతిక పరిష్కారాన్ని కనుగొనాలని ఏపీ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి సూచించారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అంగవైకల్యం కలిగిన స్కూల్ విద్యార్థులకు సాంకేతిక సహాయక ఉపకరణాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.మధుమూర్తి మాట్లాడుతూ విష్ణు కళాశాలలో అసిస్టెవ్ టెక్నాలజీ లేబొరేటరీలను స్థాపించి సాంకేతిక విజ్ఞాన ఆవిష్కరణలను సమాజ సేవకు ఉపయోగపడేలా చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని ఇప్పటికే గూగుల్ సంస్థ వస్తుంద న్నారు. విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు మాట్లాడుతూ కళాశాలలో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మాసాచుసెట్స్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకుని అసిస్టెవ్ టెక్నాలజీ లేబొరేటరీలను ఏర్పాటు చేశామన్నారు. డాక్టర్ యువీ రమణరాజు మాట్లాడుతూ కళాశాలలో లేబొరేటరీని స్థాపించిన 16 సంవత్స రాల నుంచి వికలాంగులకు సహాయ పరికరాలు అందించడం గొప్పవిషయమన్నారు.

నేత్రపర్వం.. సుదర్శన హోమం



సుందరగిరిపై నారసింహుని మూలవిరాట్‌కు హారతి ఇస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురంలోని సుందర గిరిపై కొలువుదీరిన లక్ష్మీనార సింహుని ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు బుధవారం జరిగిన ప్రదోష సాలిగ్రామ అభిషేకం భక్తులను పరవశింపజేసింది. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో పరిసరాలను సుందరీకరించారు. అనంతరం ఆలయంలో పుణ్యాహవచన, కలశస్థాపన నిర్వహించారు. ఆ తరువాత వేదమంత్రోచ్ఛరణల నడుమ శ్రీనారసింహుని మూలవిరాట్‌కు విశేష ద్రవ్యాలతో అభిషేకం, హారతులు ఇచ్చారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ వారి హుండీ ఆదాయం రూ.3.12 కోట్లు



ద్వారకాతిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామికి హుండీల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. గడచిన 29 రోజుల కాలానికి గాను జరిగిన ఈ లెక్కింపులో శ్రీ స్వామివారికి నగదు రూపేణా రూ.3.12 కోట్ల ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. స్థానిక ప్రమోద కల్యాణ మండప ఆవరణలో అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ హుండీల లెక్కింపును నిర్వహించారు. హుండీల ద్వారా లభించిన 3,12, 30,225 రూపాయల నగదుతో పాటుగా భక్తులు సమర్పించిన కానుకల రూపేణా 392 గ్రాముల బంగారం, 5.659 కేజీల వెండి లభించినట్లు ఈవో వివరించారు. అలాగే రద్దయిన పాతనోట్లు రూ.500 (4), 2000 (12)తో పాటుగా విదేశీ కరెన్సీ సైతం అధికంగా లభించింది.

నేడు పోలవరానికి మంత్రి నిమ్మల రాక

పోలవరం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భారీ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు రానున్నారు. ఉదయం 9 గంటలకు మంత్రి పోలవరం ప్రాజెక్టుకి చేరుకుంటారు. ముందుగా మంత్రి పోలవరం ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ కనెక్టివిటీలో జంటగుహల నిర్మాణపు పనులను పరిశీలిస్తారు. అనంతరం గ్యాప్ 1, 2 పనులను, ఎర్త్‌కం రాక్ఫిల్ డ్యాం పనులు పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతిపై జలవనరులశాఖ అధికారులు, ఏజన్సీల ప్రతినిధులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు.

అక్రమ కట్టడాల కొలతల సేకరణ

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):మైసన్నగూడెం ప్రభుత్వ రాళ్లగు ట్ల పోరంబోకు భూముల ఆక్రమణ, అక్రమ కట్టడాలపై ఈనెల 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై పంచాయతీ, రెవెన్యూ అధికారుల విచారణ కొనసాగుతోంది. సదరు భూమిలో దాదాపు 10 నుంచి 15 మంది అక్ర మ నిర్మాణాలు చేసినట్టు నిర్ధారణ చేసుకుని వారికి నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్డీ వో రమణ ఆదేశాల మేరకు తహసీల్దార్ స్లీవజోజి సంఘటన స్థలాన్ని పరిశీలించి అక్క డ అక్రమ కట్టడాల కొలతలను సేకరించారు. దీనిపై ఉన్నతాధికారులకు మంగళవారం రాత్రి నివేదిక పంపినట్టు సమాచారం. అలాగే ఆక్ర మణలకు పాల్పడిన దాదాపు 10 నుంచి 15 మందికి గురువారం నోటీసులు ఇవ్వను న్నారు.

భవానీ మాలధారుల ఆందోళన



స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న భవానీలు

నరసాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భవానీ మాల ధరించి స్కూల్‌కు వచ్చిన విద్యార్థినీని లోనికి అనుమతించకపోవడంతో భవానీలతో కలిసి తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో పట్టణంలోని సికిలి స్కూల్ వద్ద బుధవారం నాలుగు గంటలు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని భవానీ మాలతో స్కూల్‌కు వచ్చింది. అయితే ఆ విద్యార్థినీని స్కూల్ సిబ్బంది తరగతి గదిలోకి అనుమతించలేదు. దీంతో విద్యార్థిని తండ్రి ప్రిన్సిపాల్ సుచరితతో చర్చించారు. కరస్పాండెంట్ అనుమతి తీసుకునే భవానీని స్కూల్‌కు తీసుకొచ్చామని చెప్పే ప్రయత్నం చేశారు. అయితే సిబ్బంది ఒప్పుకోలేదు. సీబీఎస్‌ఈ నిబంధనల ప్రకారం డ్రెస్ కోడ్ తప్పనిసరన్నారు. అవసరమైతే మాల గడవు ముగిసే వరకు విద్యార్థినికి హాజరు వేస్తామని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. దీనికి విద్యార్థిని తల్లిదండ్రులు ఆంగీకరించలేదు. ముందుగా లెటర్ పెట్టుకున్న తరువాతే విద్యార్థినికి మాల వేశామని, ఇప్పుడు రూల్స్ చెబితే ఎలా అంటూ వాదానికి దిగారు. అయినప్పటికి సిబ్బంది ఒప్పుకోకపోవడంతో గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు భవానీలు స్కూల్ వద్దకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఇటు వీహెచ్‌పీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు కూడా తరలివచ్చి విద్యార్థిని తల్లిదండ్రులకు సంఘీ భావం చెప్పారు. వీరంతా ఆందోళనకు దిగడంతో స్కూల్ వద్ద హై టెన్షన్ నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఎంఈవోలు పుష్పరాజ్యం, జాన్‌కుమార్, సీఐలు యాదగిరి, దుర్గాప్రసాద్, ఎస్సై సురేష్ కూడా సిబ్బందితో స్కూల్ వద్దకు వచ్చారు. ఆందోళన చేస్తున్న వారంతా స్కూల్ ప్రాంగణంలోకి దూసుకెళ్లారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సరస్వతి దేవి, భరతమాత, అంజనేయస్వామిల చిత్రపటాలు తీసుకెళ్లి స్కూల్ ప్రాంగణంలో పెట్టారు. చివరికి ప్రిన్సిపాల్ సుచరిత రాజీనామా చేస్తున్నట్లు లిఖితపూరికంగా రాసి ఇచ్చారు. మాలతో ఉన్న విద్యార్థినీని లోనికి అనుమతించడంతో ఆందోళన విరమించారు. గతంలో కూడా ఇదే స్కూల్‌లో ఇలాంటి సంఘటనే చోటు చేసుకొన్నది. మళ్లీ మరోసారి వెలుగచూడటం గమనార్హం,



ఎస్పీ నయీం అస్మిని సన్మానిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్.. చిత్రంలో సీఐ కాళీచరణ్ తదితరులు

ఎస్పీ, సీఐలకు సన్మానం

భీమవరం క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భీమవరం రెండవ పట్టణంలో ఒక ఇంజనీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ అనే వ్యక్తి డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసపోయి రూ. 78.60 లక్షలు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. దీనిపై మోసపోయానని తెలుసుకున్న తర్వాత భీమవరం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ కాళీచరణ్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో ప్రత్యేక టీమ్‌లు పెట్టి మొత్తం మీద 13 మందిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడిని అరెస్ట్ చేయవలసి ఉంది. అయితే ఈ కేసులో రూ. 42 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. దాంతోపాటు రూ. 19 లక్షలను బ్యాంక్‌లో ఫ్రీజ్ చేశారు. మొత్తం మీద రూ. 61 లక్షలు బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకుని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని, టూటౌన్ సీఐ కాళీచరణ్‌ను ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

మెడికోల ఘర్షణపై కేసు నమోదు

ఏలూరు క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మెడికల్ కళాశాల విద్యార్థుల దాడి సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి గాది రాకేష్‌రెడ్డిపై మూడో సంవత్సరం చదివే విద్యార్థులైన సిద్ధార్థ, రాయుడు, మనీష్, జోషి మరికొంత మంది కలిసి ఈనెల 1వ తేదీ రాత్రి ఏలూరు మెడికల్ కళాశాల హాస్టల్ వద్ద దాడి చేశారని బాధితుడు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు టూటౌన్ పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు కోడికత్తుల తయారీదారుల అరెస్టు

500 కత్తులు స్వాధీనం





అరెస్టయిన కత్తుల తయారీదారులు (ఇన్‌సెట్‌లో) స్వాధీనం చేసుకున్న కత్తులు

పెదవేగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో కోడికత్తులు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని పెదవేగి సీఐ సీహెచ్.రాజశేఖర్ తెలిపారు. కోడికత్తులను తయారు చేస్తున్నారనే పక్కా సమాచారంతో బుధవారం రాత్రి దాడిచేసి, కోడికత్తులు తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని చెప్పారు. వారివద్దనుంచి 500 కత్తులను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ముగ్గురు నిందితులతోపాటు కత్తులు తయారు చేసే రెండు యంత్రాలను కూడా సీజ్ చేశామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో కోడిపందాల నిర్వహణ కోసం పందాలరాయుళ్లు ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. ఈ క్రమంలో కత్తులను తయారు చేయిస్తున్నారని తెలిపారు. ఎవ్వరైనా కోడి పందాలు వేసినా, కత్తులు తయారు చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పండుగ అంటే ఇంటిల్లపాది ఆనందంగా గడపాలే తప్ప జంతుహింసతో ఆనందం పొందడం సరైన విధానం కాదని ఆయన హితవు పలికారు. పండుగ సమయంలో ఆనందం కోసం ఆరోగ్యకరమైన ఆటలపోటీలు వంటివాటిని ఎంపిక చేసుకోవాలే తప్ప, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లవద్దని ఆయన సూచించారు.

ఇద్దరు వాకర్స్‌ను ఢీకొన్న కారు

ఒకరు మృతి.. మరొకరికి గాయాలు



మృతి చెందిన ఘంటసాల రంగబాబు

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉదయాన్నే వాకింగ్ చేస్తున్న ఇద్దరిని అతి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలోని గురకలపేటనకు చెందిన మర్రాపు రంగారావు అతని స్నేహితులు అయిన శ్రీపర్రునకు చెందిన ఘంటసాల రంగబాబు, ఇందుకూరి సుబ్బరాజులు కలిసి బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో శ్రీపర్రు నుంచి ఏలూరు వైపు వాకింగ్‌కు వస్తున్నారు. కైకలూరు వైపు నుంచి ఒక కారు అతివేగంగా వచ్చి వారిని ఢీ కొంది. ఈప్రమాదంలో ఘంటసాల రంగబాబు అక్కడికక్కడే మృతి చెందగా సుబ్బరాజు తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ బి నాగబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అతి వేగంగా కారు నడిపిన కైకలూరు మండలం బుజబలపట్నంనకు చెందిన వేగేశ్న సుధీర్‌రాజు (37) పై కేసు నమోదు చేశారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెంటపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆకుతీగపాడు గ్రామానికి చెందిన కొల్పాటి శ్రీదేవి (46) వృత్తి రీత్యా హైదరాబాదులో నివాసం ఉంటుంది. పింఛన్ తీసుకునేందుకు తన స్వగ్రామం వచ్చింది. తిరిగి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా పెంటపాడు ఎస్‌టీవీఎన్ సమీపంలో చెప్పు పడిపోతుందని తీసుకునే క్రమంలో రోడ్డుపై పడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి బంధువులు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి శ్రీదేవి మృతి చెందిందని మృతురాలి సోదరుడు నాగసత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాజేంద్ర తెలిపారు.

దొంగనోట్ల కేసులో ఐదుగురి అరెస్టు

ఏలూరు క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒక బ్యాంక్ ఏటీఎంలో దొంగనోట్లను పెట్టి ఒక మహిళ అకౌంట్‌కు డిపాజిట్ చేయడానికి ప్రయత్నించిన కేసులో ఐదుగురిని ఏలూరు రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చాటపర్రులో ఉన్న కెనరా బ్యాంక్ ఆవరణలో ఉన్న ఏటీఎంలో దొంగనోట్లను డిపాజిట్ చేయడానికి ప్రయత్నించారు. అయితే బ్యాంకు అధికారులు ఆనోట్లను గుర్తించి అవి ఏ సమయంలో ఆ నోట్లను జమ చేశారో సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించి ఈ ఏడాది మే నెలలో ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి ఈ కేసును దర్యాప్తు చేశారు. ఈకేసులో ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన (ప్రస్తుతం ఏలూరు తూర్పువీధి) సైదు సతీష్ (22), ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన కొలుసు జయంత్ (22), ఏలూరు తూర్పువీధినకు చెందిన వేమాల శివ (41), ఏలూరు రూరల్ మండలం వైఎస్ఆర్ కాలనీకి చెందిన గొరిపర్తి నాగబాబు (28), తణుకు రూరల్ మండలం గరగపర్రుకు చెందిన చెన్నా వెంకట సూర్యనారాయణ (22)లను కోర్టుకు హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.



లక్ష్మీగణపతి స్వామికి అర్చనలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మార్గశిర బుధవారం నేపథ్యంలో సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు వారణాసి రామేంద్రశర్మ స్వామికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు తగు ఏర్పాట్లు చేశారు.

● దెందులూరులోని నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో బుధవారం భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు.



దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్రశిక్షా అభియాన్ జిల్లా ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక అశోకవర్ధిని మున్సిపల్ స్కూలు ప్రాంగణంలో నిర్వహిస్తున్న జిల్లా వనరుల కేంద్రం, భవిత సెంటర్‌లో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం నిర్వహిస్తున్న వివిధరకాల సేవలను, ఇంటివద్ద చేపట్టాల్సిన శిక్షణలను తల్లిదండ్రులు సమగ్రంగా తెలుసుకుని పాటించాలన్నారు. విలీనవిద్య జిల్లా కో-ఆర్డినేటర్ భాస్కరరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత ఉపకరణాలకు అర్హులను గుర్తించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అసెస్‌మెంట్ క్యాంపులను పూర్తిచేసి ఉన్నతాధికారులకు నివేదికను పంపించామని, త్వరలోనే ఉపకరణాలు రానున్నాయని వెల్లడించారు.సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవోలు రవిప్రకాష్, అరుణ్ కుమార్, ఐఈఆర్టీలు శ్యామల, దయామణి, రజిత పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం ముందుకు సాగాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్య సాధన కోసం ముందుకు సాగాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ హైమావతి క్లబ్ అధ్యక్షుడు ఎం.ఎల్. నరసింహరావు అన్నారు. టెన్త్, ఇంటర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై బుధవారం వర్క్ షాప్ నిర్వహించారు. జీవితంలో ఎలా ఎదగాలనే అంశంపై శిక్షణ ఏర్పాటు చేశారు. 28 రోజుల పాటు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, స్కిల్ డెవలప్‌మెంట్, బాడీ అనాలసిస్, మైండ్ థెరఫీ, తదితర అంశాలలో శిక్షణ అందిస్తామని నరసింహరావు తెలిపారు. విద్యార్థులకు చదవడం, జ్ఞాపకశక్తి పెంచుకోవడం పరీక్షలు రాయడంలో మెలకువలు గురించి వివరించారు. జూమ్ మీటింగ్ ద్వారా ప్రతిరోజు రాత్రి 8గంటల నుంచి 9గంటల వరకు ఉచితంగా విద్యార్థులు శిక్షణ పొందవచ్చు అన్నారు. మరింత సమాచారానికి 94917 23961 నెంబర్లో సంప్రదించవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు ధర్మాజీగూడెంలో రోబోటిక్స్, ఏఐపై అవగాహన

లింగపాలెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెంలోని క్రిశాలిస్ పాఠశాలలో గురువారం రోబోటిక్స్, ఏఐపై మండలంలోని అన్ని విద్యా సంస్థల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని పాఠశాల డైరెక్టర్లు తాడేపల్లి క్రాంతి కుమార్, బట్టు విజయ్‌కుమార్ తెలిపారు. రెండు రోజుల పాటు గురు, శుక్రవారం నిర్వహిస్తున్నామని మండలంలోని అన్ని పాఠశాలలు,కళాశాలల విద్యార్థులు ఈ రోబోటిక్స్ వర్క్‌షాప్‌లో పాల్గొనాలని కోరారు. రోబోటిక్స్, ఏఐ సాంకేతిక నిపుణులు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొంటారని తెలిపారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



బుట్టాయగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగనవాడీ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 12న జరిగే కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఏఐటీ యూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కోమరం మారమ్మ పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని బుధవారం సీడీపీవో యు.వి.పద్మావతికి అందజేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.ఆకాష్, కె.రామలక్ష్మీ, కె.వి.రమణ పాల్గొన్నారు.

తొమ్మిది మంది తలసీమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసీమియా భవనంలో 9 మంది చిన్నారులకు రక్తమార్పిడి చేసినట్టు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వి ప్రసాద్ తెలిపారు. డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి బాధిత చిన్నారులకు మెరుగైన వైద్య సేవలందించడంతోపాటు, భవిష్యత్తు తరాలకు వ్యాధి రాకుండా జాగ్రత్త పడేందుకు హెచ్‌పిఎల్‌సి పరీక్షలను కూడా చేస్తున్నామన్నారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ జె.సత్యనారాయణరాజు, డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాస్, డాక్టర్ వివిన్ శాస్త్రి, ఎం.శాంతకుమారి పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

కూటమితో రోడ్లకు మహర్దశ : ఎమ్మెల్యే చంటి

ఏలూరుటూటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాత రోడ్లకు మహర్దశ పట్టుకుం దని ఎమ్మెల్యే బడేటి చంటి అ న్నారు. వంగాయిగూడెంలో రూ.3 కోట్లతో ప్రారంభించిన రోడ్ల నిర్మాణ పనితీరును ఎమ్మెల్యే చంటి పరి శీలించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయన్నారు. రోడ్లపై ప్రయాణం చేయలేక ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఏలూరు నియోజకవర్గంలో దాదాపు రూ.50 కోట్లతో నూతన రోడ్లు నిర్మించామన్నారు. రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమా మహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్.పెదబాబు పాల్గొన్నారు.

ఇప్పటి వరకు రూ.3.5 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.3.5కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు ఏలూరు నియోజకవర్గంలో పంపిణీ చేశామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. 6వ డివిజన్ బగ్గయ్యపేటకు చెందిన చింతలపూడి నూకరాజు గుండె సమస్యతో బాధపడుతూ వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.నాలుగున్నర లక్షలకు ఎల్‌ఓసీని అందజేశారు. డివిజన్ ఇన్‌చార్జి ఎం.రమేశ్ పాల్గొన్నారు.

అంబికాదేవి ఆలయ ప్రాంగణంలో ఆంజనేయుడి పూజలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో గల ఆంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు హనుమాన్ వ్రతాలను జరిపారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రామేంద్రశర్మ భక్తులతో సామూహికంగా హనుమాన్ వ్రతాలను జరిపించారు.

రైతన్నా మీకోసం.. నేనున్నా!

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నందుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును ప్రత్యేకంగా అభినందించారు. రోడ్ల పొడవునా కార్య కర్తలు బారులు తీరారు. పోలీసులు బందోబస్తు, భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. గోపాలపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.320 కోట్ల ప్రణాళికను ఎమ్మెల్యే మద్దిపాటి సీఎంకు అందజేశారు. తొలుత నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, కలెక్టర్ కీర్తి చేకూరి,ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.నర సింహకిశోర్, ఎమ్మెల్యేలు మద్ది పాటి వెంకట్రాజు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డివాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన నేత సువర్ణరాజు, మహిళా నేతలు స్వాగతం పలికారు.

సీఎం పక్కనే : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇద్దరు రైతులను తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. అందులో ఒకరు ప్రకాశరావుపాలెంకు చెందిన రైతు, మాజీ సర్పంచ్ నీలపాట నరసింహం కుడివైపు కూర్చోగా, నల్లజర్లకు చెందిన గుదే అర్జునరావు ఎడమ వైపు కూర్చున్నారు. దీని తమ అదృష్టంగా భావిస్తున్నట్టు వారిద్దరూ పేర్కొన్నారు.

విందు.. పసందు : సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రజలకు విందు పసందుగా ఏర్పాటుచేశారు. సీఎం చంద్రబాబు రైతన్న మీకోసం' వచ్చిన వేళ రైతులు, అధికారులు, కార్యకర్తలు, నాయకులు, సామాన్య ప్రజలకు సుమారు 12 వేల మందికి కేసరి స్వీట్, బిర్యానీ, కోడికూర, సాంబారు అన్నం, పెరుగన్నంతో భోజనం వడ్డించారు. ఉదయం 10.30 గంటల నుంచే సుమారు 10 స్టాల్స్ ఏర్పాటు చేయడంతో ఎవరికీ ఇబ్బంది లేకుండా భోజనాలు చేశారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

భీమడోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి అన్నదాతల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగపర్చుకోవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలను రైతు సేవా కేంద్రంలో బుధవారం జరిగిన రైతన్న మీ కోసం వర్క్‌షాపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతుల అభివృద్ధికి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పంచసూత్రాలపై అవగాహన కల్పించారు. కూటమి నేతలు సిరిబత్తిన కొండబాబు, కరణం పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ శేషగిరి, కుక్కల ప్రసాద్, అజయ్, ఏడీఏ ఉషారాజ కుమారి, ఏవో ఉషా రాణి, ఎంపీడీవో పద్మావతి దేవి, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

రైతులకు లేఖలు అందజేసిన ఎమ్మెల్యేలు

కరపత్రాలు పంపిణీ చేసిన చింతమనేని



కరపత్రాలను పంచుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులను ఆర్థికంగా పటిష్టం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. విజయరాయిలో బుధవారం జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు పంచసూత్రాల ప్రణాళికను అమలు చేస్తున్నారని, ఇప్పటికే క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహనా కార్యక్రమాలను అధికారులు నిర్వహిస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు రావిపాటి పిచ్చియ్య చౌదరి, ఈడ్పుగంటి గిరిబాబు, పెదర్ల రాంబాబు, దారిబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.



పాటల స్కానర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీసత్యసాయి చిత్రం పాటల ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెంలోని శ్రీఅభయాంజనేయస్వామి సన్నిధిలో వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ నిర్వహణలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు, సినీ నిర్మాత కరాటం రాంబాబు నిర్మించిన భగవాన్ శ్రీసత్య సాయి బాబా సినిమా పాటల స్కానర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.బాబా 100వ జయంతిని పురస్కరించుకుని పుట్టపర్తి ప్రశాంత నిలయంలో పాటలను ఆవిష్కరించామన్నారు. పి.రామ్‌కుమార్, కె.సాయి, ఉమామహేశ్వరరావు, సత్తిపండు, రమాదేవి, రామకృష్ణ, ప్రసాద్, రామలక్ష్మి, ఉమ, నాని, సీతారాం, రామారావు, బాబి, పండు, మంగరాజు పాల్గొన్నారు.

వ్యాయామ కాలేజీకి వితరణ

దెందులూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ కాలేజీ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సౌండ్ బాక్స్, ఎల్‌సీడీ ప్రొజెక్టర్ అందజేశారు. బుధవారం శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయాయ విద్య కాలేజీలో 1981-82 సంవత్సరంలో వ్యాయామ విద్య చదివిన పూర్వ విద్యార్థి ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఆర్.పి. నారాయణస్వామి రూ.లక్ష రూపాయలతో పాటుగా పూర్వ విద్యార్థులు రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ జి.కుసుమ కుమారి రూ.25 వేలు, తణుకు చెందిన పూర్వ విద్యార్థి రూ.20 వేలు మొత్తం రూ.లక్షా 55వేలతో కొనుగోలు చేసిన పరికరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియల్‌కు అందజేశారు. రిటైర్డ్ పీడిలు పురుషోత్తం, వీఎస్‌వీఎస్ బాబు, పతంజలి, సూపరింటెండెంట్ జైశ్రీ పాల్గొన్నారు.

పదవ రోజుకు చేరిన దీక్షలు

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నిర్వహిస్తున్న పెట్రోలు బంకులో జరిగిన రూ.82 లక్షల అవినీతితో సంబంధం లేని ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఆర్టీసీ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ సమితి చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 10వ రోజుకు చేరుకున్నాయి. సస్పెన్షన్లు ఎత్తివేయాలంటూ నినాదాలు చేశారు. వివిధ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగ సంఘాల అమరావతి జేఏసీ ఇప్పటికే మద్దతు ప్రకటించిందని చెప్పారు.

సమగ్ర వైద్య పరీక్షలు చేయండి

ఏలూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా స్క్రబ్ టైఫస్ వ్యాధి జాడలు లేవని, ఎవరైనా చర్మంపై దురద, దద్దుర్లు, జ్వరంతో పీహెచ్‌సీలకు వస్తే వారికి సమగ్ర వైద్య పరీక్షలు చేయాలని వైద్యాధికారులకు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం సూచించారు. తన కార్యాలయంలో బుధవారం ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన సమీక్షలో పలు వైద్య పథకాల అమలు, వైద్య పరీక్షల డేటాను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ బోద వ్యాధి నిర్మూలనలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన నైట్ బ్లడ్ సర్వేలో ఎక్కువ రక్తనమూనాలను సేకరించాలని, గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్, కార్యాలయ ఏవో డాక్టర్ గంగాభవాని, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, హైల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

టి.నరసాపురం పరిధిలో..


టి.నరసాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు బోధ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎన్ఎ ప్రసాద్ తెలిపారు. మండలంలోని టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గండిగూడెం, బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బోధ వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షల నమూనాలను బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లా డీఎంహెచ్‌వో, డీఎంఓ ఆదేశాలు మేరకు చింతలపూడి సబ్ యూనిట్ పరిధిలో మండలానికి రెండు చెప్పున రక్త పరీక్షల నమూనాలను తీస్తున్నట్టు తెలిపారు. చింతలపూడి సబ్‌యూ నిట్ పరిధిలో 8 డెంగీ కేసులు నమోదు కాగా మ లేరియా పూర్తిగా అదుపులో ఉందన్నారు.

భూ రికార్డుల పరిశీలన

బుట్టాయగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పోలవరం ప్రాజెక్టు గిరిజన నిర్వాసితుల కోసం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలో సేకరిస్తున్న భూములకు చెందిన రికార్డులను ఆర్డీవో ఎంవీ రమణ, డిప్యూటీ కలెక్టర్ ఆంజనేయులు బుట్టాయగూడెం రెవెన్యూ కార్యాలయంలో బుధవారం పరిశీలించారు. రైతుల నుంచి సుమారు 120 ఎకరాల భూమికి ప్రిలిమినరీ నోటిఫికేషన్ రావడంతో భూములపై వివాదాలు, ఇతర అభ్యంతరాలపై అధికారులను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు, అధికారులు సిబ్బంది ఉన్నారు.

టెన్త్ మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ

ఏలూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి రూపొందించిన టెన్త్ క్లాస్ మోడల్ టెస్ట్ పేపర్లను ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థుల కోసం మోడల్ టెస్ట్ పేపర్లు రూపొందించి పంపిణీ చేస్తోందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు డి.సాల్మన్‌రాజ్, రవిప్రసాద్, కె.దేవి ప్రసాద్, పి.జనార్దన్‌రావు, దాసు, బి.రాము పాల్గొన్నారు.



సీఎంతో మాట్లాడుతున్న మారిశెట్టి ప్రసాద్

రైతులను ఆదుకోవాలని సీఎంకు వినతి

నిడమర్రు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజావేదిక, ఎన్టీఆర్ సామాజిక పింఛన్లు పంపిణీకి హాజరైన సీఎం చంద్రబాబును నల్లమాడు హెలిప్యాడ్ వద్ద ఉంగుటూరు మండలం మాజీ మండల పరిషత్ అధ్యక్షులు, పెంటపాడు వాటర్ డీసీసీ మాజీ చైర్మన్ మారిశెట్టి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును డెల్టాలో కాలువల అభివృద్ధికి తగిన నిధులు మంజూరు చేయాలని, మెట్ట రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

కాలానుగుణంగా సాగు చేపట్టాలి

వేలేరుపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సమాజంలో మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రైతులు పంటలు పండించాలని వేలేరుపాడు వ్యవసాయాధికారి సమీరజ కోరారు. బుధవారం మండలంలోని మేడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతుల వర్క్‌షాప్ నిర్వహించారు. హాజరైన రైతులకు పలు సూచనలు చేశారు.చిరుధాన్యాల సాగు మరింత పెరగాలన్నారు. సబ్సిడీ ద్వారా రైతులకు యంత్రాలు, కిసాన్ డ్రోన్లను అందిస్తున్నామన్నారు. వర్క్‌షాప్‌లో ప్రకృతి వ్యవసాయాధికారి కిషోర్, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు క్రాంతికుమార్, చాపర్ల శ్రీనివాసరావు, కుంజా లక్ష్మయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

» ఎమ్మెల్యే రోషన్ కుమార్

లింగపాలెం/ జంగారెడ్డిగూడెం /చింతలపూడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని తమలోని ప్రతిభను చాటుతూ అందరికీ స్ఫూర్తి కావాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని దర్మాజీగూడెంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని లింగపాలెం మండలం ధర్మాజీగూడెం భవిత కేంద్రంలో నిర్వహించారు. సమగ్రశిక్ష జిల్లా దివ్యాంగుల సమన్వయకర్త భాస్కరరావు, సమగ్రశిక్ష ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ సొంగా నాగేశ్వరరావు, ఎంఈఓలు కె.వి. దుర్గాప్రసాద్, జె.రవీంద్ర, పల్లి శ్రీను, గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, మోరంపూడి వరప్రసాద్, నిమ్మగడ్డ సుధాకర్ పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలోని బాయ్స్‌హైస్కూల్, ఇందిరానగర్‌లోని భవిత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, కౌన్సిలర్ వలవల తాతాజీ, కె.రమాదేవి పాల్గొని మాట్లాడారు. చింతలపూడి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, విజయ కుమారి, ఎంపీడీవో కామేశ్వరి పాల్గొని మాట్లాడారు.

దివ్యాంగులకు అండగా ఉండాలి : రత్న ప్రసాద్

పెదవేగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):విభిన్న ప్రతిభావంతులకు కనీస ఆసరా కల్పిస్తే సమాజంలో గౌరవ ప్రదమైన స్థానానికి చేరుకుంటారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు.అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలం జానంపేట పంచాయతీ, ప్రకాష్ నగర్‌లోని విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బుధవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

విజయానికి వైకల్యం అడ్డుకాదు : డీఈవో

ఏలూరు రూరల్: విజయానికి వైకల్యం అడ్డుకాదని జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం దొండపాడులో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్‌తో కలిసి డీఈవో కేక్‌కట్ చేశారు. డీసీఈబీ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెదవేగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరుస తుపానుల నేపథ్యంలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెదవేగి మండలం ముందూరు, వేగివాడ గ్రామాల్లో వరి పొలాలను రైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. ఎకరాకు 15 బస్తాలకు పైగా దిగుబడి తగ్గి, రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు వేగుంట రామకృష్ణ, తిప్పాభట్ల పురుషోత్తం, చొదిమెళ్ల ఏసురాజు, సురేష్, భీమడోలు మహాలక్ష్ముడు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా హనుమద్ వ్రతం

ద్వారకాతిరుమల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హనుమద్ వ్రతం వేడుకలు శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, పండితులు స్వామిని విశేష పుష్పాలంకారాలు చేశారు. ఆలయ గర్భాలయంలో కొలువైన స్వామికి అర్చకులు పంచామృతస్నపన, సహస్ర నాగావళి పూజలు నిర్వహించారు. అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



మృతి చెందిన వెంకట రమణ

ఏలూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎలక్ట్రికల్ ట్రేడ్ యూనియన్, రాష్ట్ర కమిటీ సభ్యులు మోయి వెంకటరమణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల భీమడోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట రమణ మృతి చెందడంతో పెద్ద దిక్కును కోల్పోయి ఆ కుటుంబం వీధిన పడిందన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఉంటే ఆ కుటుంబానికి ఆసరా అయ్యేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్న సంక్షేమ బోర్డు పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి ఇప్పటికి 18 నెలలైందని, బోర్డును పునరుద్ధరించాలన్నారు.

ఐక్యతతో ప్రతిఘటించాలి

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలపై ఎన్డీఏ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. స్థానిక అన్నేభవనం వద్ద బుధవారం జరిగిన ఉపాధి కూలీల సమావేశానికి టి.ముత్యాలమ్మ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని మరింత నిర్వీర్యం చేయడానికి మస్టరు విధానంలో మార్పు చేశారన్నారు. ఉపాధి కార్మిక సంఘం నాయకులు ఎస్. కోటేశ్వరరావు, వెంకటేష్, వెంకట్రావు, దుర్గ పాల్గొన్నారు.

సాగులో సేంద్రియ ఎరువులే వాడాలి

పోలవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):రసాయన రహిత సేంద్రియ వ్యవసాయం లాభదాయకం, ఆరోగ్య హితమని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు అన్నారు. బుధవారం ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలవరంలో స్థానిక రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన రైతన్న మీ కోసం వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో సాంకేతికత అనుసంధానం చేయడంతో యాంత్రీకరణతో ఖర్చులు తగ్గి దిగుబడులు పెంచుకోవడంపై అవగాహన పెంచుకోవాలన్నారు.కూటమి నేతలు గునపర్తి చిన్ని, కొణతాల ప్రసాద్, పాదం ప్రసాద్, అనిశెట్టి రాధాకృష్ణ, సొసైటీ కార్యదర్శి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బహుమతుల అందజేత

ఏలూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విజయానికి వైకల్యం అడ్డుకాదని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలు ప్రారంభించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఇటీవల క్రీడా పోటీలు నిర్వహించగా గెలుపొందిన విజేతలకు ప్రశంస పత్రాలు, బహుమతులు జేసీ చేతుల మీదుగా అందజేశారు.

కైకరంలో ఘనంగా షష్టి ఉత్సవాలు

నిడమర్రు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం కైకరంలో ఉన్న స్వయంభూ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ 91వ షష్టి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం షష్టి ఊరేగింపు సందర్భంగా పుట్టింటి వారైన అద్దేపల్లి శేషయ్య ఇంటి వద్ద అమ్మవారి చిత్రపటానికి పసుపు కుంకుమ, అమ్మవారికి చీర, సారె పెట్టి ఘనంగా సత్కరించారు. అలాగే అత్తింటి వారైన శానం వారైన శానం నరసింహారావు ఇంటి వద్ద అమ్మవారికి సారె పెట్టి ఘనంగా సాగనంపారు. తదుపరి అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఆలయ కమిటీ చైర్మన్ నాగమ్మతల్లి కుమార్తె యెలిశెట్టి చిన్ననాగ అన్నపూర్ణాదేవి తెలిపారు.

హామీలు అమలు చెయ్యండి

ఏలూరుటూటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గతంలో చేసిన సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షు, కార్యదర్శులు ఎస్.కన కారావు, ఎం.ఇస్సాకు, పంపన రవికుమార్ పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు

బుట్టాయగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి పేరుతో దేశ, విదేశాల నుంచి కోట్లలో నిధులు సేకరిస్తూ సొమ్ములను దుర్వినియోగం చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలపై చర్యలు తీసుకోవాలంటూ బుధవారం కె.ఆర్.పురం ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో ఆప్తమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ ముచ్చిక రంజిత్ కుమార్ దొర, పీవో కె.రాములు నాయక్‌కు ఫిర్యాదు చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజనుల పేరుతో సేకరించే డబ్బును వారి అభివృద్ధికి కాకుండా సొంత అవసరాలకు వాడుకుంటున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటివారి వల్ల సక్రమంగా పని చేస్తున్న సంస్థలకు చెడ్డపేరు వస్తోందన్నారు.

దత్త జయంతికి సర్వం సిద్ధం

కామవరపుకోట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని షిర్డీ సాయి మందిరాల వద్ద గురువారం మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయ జయంతిని జరిపేందుకు మందిరాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మందిరాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఈ మేరకు కామవరపు కోట, తేలీల బజారు, పాతూరు, కొత్తూరు, మద్దిపాటివారిగూడెం, యడవల్లి, ఆడమిల్లి, తడికలపూడి, కళ్లచెరువు, జీలకర్రగూడెం, తదితర గ్రామాల్లోని షిరిడీ సాయి మందిరాల వద్ద దత్త జయంతి పూజలకు మస్తాబయ్యాయి. ఏలూరు నగరంలోని పలు డివిజన్లలోని షిరిడీ సాయి మందిరాల వద్ద దత్తాత్రేయ జయంతిని నిర్వహించేందుకు మందిర్ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఆదివారపుపేటలోని షిర్డీసాయి ప్రేమ మందిర్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు.

కోడిపందేల నిర్వాహకులు అరెస్ట్

పెదపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం కొణికి గ్రామంలో కోడిపందాలు ఆడుతున్నారనే సమాచారం మేరకు పెదవేగి సీఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి మంగళవారం అర్ధరాత్రి దాడి చేసి 15 మంది కోడిపందాలు నిర్వహిస్తున్న వారిని అరెస్ట్ చేసినట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వీరి నుంచి ఎనిమిది కోడిపుంజులు, 20 కోడికత్తులు, మూడు కార్లు, రూ.65,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన దాసరి శ్యామ్

జంగారెడ్డిగూడెం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): నల్లజర్లలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబును రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు స్వాగతం పలికారు. రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చెయ్యాలని సీఎం సూచించినట్లు శేషు తెలిపారు.

నేడు మద్దిలో మహాపూర్ణాహుతి

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామిని బుధవారం అధిక సంఖ్యలో హనుమద్ దీక్షదారులు దర్శించుకున్నారు. అనంతరం దీక్షదారులు ఇరుముడులు ధరించారు. ఉదయం 8గంటలకు హనుమద్ వ్రతంను ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో సామూహికంగా నిర్వహించారు. గురువారం జరిగే హనుమద్ దీక్షాదారుల మహాపూర్ణాహుతి సందర్భంగా హోమగుండంను ప్రారంభించారు. ఉదయం 6గంటల ప్రత్యేక పూజ, భజనా కార్యక్రమాల అనంతరం స్వామి వారికి విశేష పంచామృత అభిషేకాలు జరుగుతాయని ఈవో చందన తెలిపారు.

వాటర్ ట్యాంకు చక్రాలు చోరీ

టి.నరసాపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వాటర్ టాంకర్ చక్రాలు, డిస్కుల చోరీపై బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం. జయబాబు తెలిపారు. కామవరపుకోట మండలం కంతమనేనివారిగూడెం గ్రామానికి చెందిన గరిమెళ్ల గంగాభవాని టి.నరసాపురం మండలం రాజుపోతేపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్న జి.మార్ట్‌కు ఎదురుగా ఉన్న స్థలంలోని వాటర్ ట్యాంకు చక్రాలు, డిస్కులు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

మెరుగైన సేవలందించండి

చింతలపూడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ వైద్యులకు సూచించారు. బుధవారం ఏరియా ఆసుపత్రికి నూతనంగా వచ్చిన వైద్యుల సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డీసీహెచ్ఎస్ పాల్ సతీశ్ మాట్లాడుతూ ఈ ఆసుపత్రికి వైద్యులు రావడంలేదని, ఏజెన్సీ ఆసుపత్రిగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.నారాయణరావు, ఆర్ఎంవో డాక్టర్ జబీవుల్లా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కె.దేవ, జి. భారతి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌రే టెక్నీషియన్‌ను నియమించాలి

చింతలపూడి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో ఎక్స్‌రే టెక్నీషియన్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. గత కొద్ది రోజులుగా వైద్యుల సంఖ్య పెరిగింది. మొత్తం 16 మంది ఉన్నారు. అయితే పేషెంట్లకు ఎక్స్‌రే తీయించాలని ప్రిస్క్రిప్షన్ రాస్తే అందుకు సంబంధించిన టెక్నీషియన్ లేక పోవడంతో బయటకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. టెక్నీషియన్‌ను నియమించి పేదలను ఆదుకోవాలని కోరుతున్నారు.

శస్త్రచికిత్సకు ఎల్‌వోసీ అందజేసిన మంత్రి సారథి

చాట్రాయి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడుకు చెందిన నిడికొండ చెన్న కేశవులు కాలి శస్త్రచికిత్సకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 1.50 లక్షల ఎల్‌వోసీని బుధవారం మంత్రి పార్థసారథి అందజేశారు. చెన్నకేశవులుది పేద కుటుంబం కావటంతో సమస్యను స్థానిక టీడీపీ నాయకులు యలమంచిలి నన్నాజీ, బొంతు నరేష్ మంత్రి దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన ఎల్‌వోసీ మంజూరు చేయించారు.

స్టడీ మెటీరియల్ వితరణ

ముసునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి జడ్పీ పాఠశాల టెన్త్ విద్యార్థులు 80 మందికి విశ్రాంత ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు అమ్ముల సుధాకర్, రాజేశ్వరి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులు సాధించాలని హెచ్‌ఎం అల్లాభక్షు పేర్కొన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.పద్మ కిషోర్, జి.రాంబాబు, సహాధ్యక్షుడు పుల్లయ్య, కోశాధికారి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దిత్వాతో దిక్కుతోచని రైతన్న

బరకాల కిందే మగ్గుతున్న ధాన్యం రాశులు



ముదినేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ రైతులను దిక్కుతోచని స్థితిలో పడేసింది. కోతలు ముగిసి రోడ్లకు చేర్చిన ధాన్యాన్ని తేమ శాతం తగ్గించేందుకు ఆరబెట్టుకునే అవకాశం లేకుండా పోయింది. ముదినేపల్లి ప్రాంతంలో ఏ రోడ్డులో చూసినా ధాన్యం నిల్వలే కనిపిస్తున్నాయి. ధాన్యం తడవకుండా రాశులపై కప్పిన బరకాలను తొలగించే పరిస్థితి లేకుండా పోయింది. కోతలకు సిద్ధంగా ఉన్న వేలాది ఎకరాల్లోని వరిపైరు చిన్నపాటి వర్షానికి తడిసి నేలవాలుతున్నది. ముదినేపల్లి మండలంలో పూర్తిగా పండిన వరిపైరు సుమారు 7 వేల ఎకరాల్లో సిద్ధంగా ఉండగా, సుమారు 1500 ఎకరాల్లో పనపై ఉంది. మరో మూడు వేల ఎకరాల్లో పండిన పంట రోడ్ల వెంబడి నిల్వ ఉంది. తుఫాన్ ప్రభావంతో ప్రతి రోజూ వర్షం కురుస్తుండడంతో బరకాల కింద వారం రోజుల నుంచి నిల్వ ఉన్న ధాన్యం రంగుమారి గింజ ముక్కలయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ధర తగ్గించి ఇచ్చినా పలువురు రైతులు తడి ధాన్యాన్నే మిల్లులకు తోలుతు న్నారు.

ఆరని ధాన్యానికి ధరలో కోత

17 శాతం తేమ ఉన్న ధాన్యం 75 కేజీలు రూ. 1770 మద్దతు ధరకు అమ్మాల్సి ఉండగా, వరి కోత యంత్రాలతో కోసి సరిగ్గా ఆరని ధాన్యంలో 25 నుంచి 30 శాతం వరకు తేమ ఉండడంతో ఆ ధరను రూ. 1400కు మిల్లర్లు తగ్గిస్తున్నారు. మరో నాలుగు రోజులు ఆగితే ధాన్యం రంగు మారి ముక్కిపోతుందన్న భయంతో రైతులు అయిన కాడికి అమ్ముకుంటూ నష్టపోతున్నారు. అదీ గాక మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం కొనుగోళ్ళ టార్గెట్ పూర్తి కానుండడంతో రైతుల్లో మరింత కంగారు పెరిగింది.

తేమ శాతం 25కు పెంచాలి

ముదినేపల్లి మండల పరిషత్ సమావేశం తీర్మానం



మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ


ముదినేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిబంధనలను సడలించాలని, రైతుల వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని సేకరించేందుకు పౌర సరఫరాల శాఖ అధికార్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశం దిత్వా తుఫాను ఫలితంగా ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవకాశం లేకపోతున్నదని, తేమ శాతాన్ని 17 నుంచి 25 శాతానికి పెంచి మద్దతు ధర చెల్లించాలని తీర్మానించింది. రంగుమారిన, ముక్కిన ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర కల్పించాలని, మిల్లర్లకు కొనుగోళ్ళ టార్గెట్‌ను పెంచాలని ఎంపీపీతో పాటు పలువురు సభ్యులు కోరారు. శిథిల పాఠశాలల భవనాలకు మరమ్మతులు చేయాలని కోరారు. జడ్పీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో వై రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవోలు అశోక్, విజయభాస్కర్, ఏవో వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు మెమెంటో, నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కామినేని

వాలీబాల్ విజేత తాడినాడ జట్టు

కైకలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించి ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులో మూడు రోజులుగా కామినేని జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన తల్లి కామినేని రాజేశ్వరమ్మ పేరిట రుపై నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. మొత్తం 32 జట్లు పోటీ పడగా ఫైనల్స్‌లో కైకలూరు, కలిదిండి మండలం తాడినాడ గ్రామాల జట్లు పోటీపడగా తాడినాడ జట్టు విజయం సాధించింది. ఎమ్మెల్యే కామినేని చేతులమీదుగా మెమెంటో, రూ.20వేలు నగదు, రన్నర్స్‌గా నిలిచిన కైకలూరు జట్టుకు రూ.15 వేలు నగదు, మెమెంటోను అందజేశారు. చింతలపూడి మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, రాష్ట్ర చేపల రైతు సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, కార్పొరేషన్ల డైరెక్టర్లు అంగ్రాజు శ్రీనివాసరావు, నల్లగోపుల చలపతి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, సర్పంచ్ కేవీఎస్‌ఎం నాయుడు, బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకటరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



షష్టి ఉత్సవాల్లో అష్టోత్తర శత కలశార్చన

ముదినేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటరులోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో షష్టి కల్యాణోత్సవాల సందర్భంగా బుధవారం అష్టోత్తర శత కలశార్చన వైభవంగా జరిగింది. 108 కలశాలతో తెచ్చిన జలాలతో స్వామి వార్లకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగా శ్రీ దేవి, అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, ఉప్పలపాటి విమల, బెజవాడ రాధాకృష్ణ, దగాని నాగలక్ష్మి తదితరులు శత కలశార్చన పూజలు నిర్వహించారు. అనంతరం వేదసభ నిర్వహించారు. కైకలూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివకిరణ్ దంపతులు స్వామికి పూజలు జరిపారు.


వైభవంగా దాసాంజనేయ కల్యాణం

కైకలూరు: కైకలూరు-కోరుకొల్లు రోడ్డులోని శ్రీసువర్చలా దాసాంజనేయ స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

నేడు ఆగిరిపల్లిలో కలశ జ్యోతుల ప్రదర్శన

ఆగిరిపల్లి: స్థానిక వరాహ పుష్కరిణి సమీపంలోని దుర్గమ్మ ఆలయం వద్ద గురువారం కలశ జ్యోతుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శోభనచాల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణలో దుర్గమ్మ పల్లకిలో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారని, రాత్రి 8 గంటలకు హోమ గుండం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



కైకలూరులో మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మి



రమణక్కపేటలో బహుమతులిస్తున్న ఎంపీపీ



కలిదిండిలో బహుమతులిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్



ముదినేపల్లిలో పరికరాలిస్తున్న ఎంపీపీ

దివ్యాంగులకు హక్కులు, చట్టాలున్నాయి

» కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి » ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కైకలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక హక్కులు, చట్టాలున్నాయని వాటిని వినియోగించుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. బుధవారం కైకలూరు భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ దివ్యాంగులను ఎవరైనా వివక్షకు గురిచేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చన్నారు. భవిత కేంద్రంలో పిల్లలకు విద్య, ఫిజియోథెరపీని, ప్రభుత్వం అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈఓ-2 శ్రీనివాస రావు, న్యాయవాదులు పి. పవన్‌కాంత్, డి. శివప్రసాద్, భవిత కేంద్రం టీచర్లు జి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: దివ్యాంగుల్లో మనో ధైర్యాన్ని నింపేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. బుధవారం రమణక్కపేట మెయిన్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో ఆమె పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు సహాయ సహకారాలను అందించాలని కోరారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎంపీపీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, జనసేన నాయకుడు పాశం నాగబాబు, హెచ్‌ఎం రామకృష్ణారావు, ఐఈఆర్పీలు లక్ష్మీనారాయణ, నాగమల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి కోరారు. చాట్రాయి భవిత సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులలో ఎంతో ప్రతిభ దాగి ఉంటుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు. ఎంపీడీవో జి. రాజు, ఎంఈవోలు ఎం. శ్రీనివాస్, బ్రహ్మాచారి, ఎస్బీఐ మేనేజర్ సంజీవకుమార్, జనసేన నాయకుడు సవరం రామారావు, వ్యాపార ప్రముఖుడు వీసం బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలోని భవిత దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ అనిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగుల బంగారు భవిష్యత్తుకు అంగవైకల్యం అడ్డుకాదని ధైర్యంగా పాఠశాలకు వెళ్లి బాగా చదువుకోవాని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలిదిండి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం స్వర్ణకుమారి పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి ఎంపీపీ విరాళం

ముదినేపల్లి: ముదినేపల్లిలోని భవిత కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ భవిత కేంద్రానికి రూ. 50 వేల విరాళంతో వాటర్ కూలర్, వివిధ పరికరాలు, ఆట వస్తువులను అందించారు. దివ్యాంగులకు జ్ఞాపికలను అందజేశారు. ఎంఈవో నరేష్‌కుమార్, ముదినేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం విజయకుమార్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు సునీత, నీలిమ, మోహన ఫణికుమార్ పాల్గొన్నారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు పుట్టి గణేష్‌బాబు దివ్యాంగులకు విందు ఏర్పాటు చేశారు.

కోలాహలంగా ఎమ్మెల్యే కామినేని పుట్టినరోజు వేడుకలు





అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్.. గజమాలతో కామినేనిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కైకలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ జన్మదిన వేడుకలను అభిమానుల కోలాహలం మధ్య ఘనంగా జరుపుకు న్నారు. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో అభిమానులు, కూటమి నాయకుల మధ్య భారీ కేక్‌లను కట్ చేశారు. రాచపట్నంలో అభిమానుల మధ్యన ఆంజనేయస్వామి గుడి వద్ద, కైకలూరు సర్పంచ్ కేవీఎస్‌ఎం నాయుడు ఆధ్వర్యంలో తాలుకా సెంటర్లో కేక్ కట్ చేశారు. నియోజక వర్గంలో కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు, కొల్లేరు ప్రజలు, పెద్దఎత్తున తరలివచ్చి పుష్ప గుచ్ఛాలు, గజమాలలు, పుస్తకాలు కామినేనికి అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ కామినేనికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ ప్రజల ఆప్యాయతతో మరింతఉత్సాహంగా పని చేసి నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. భారీ స్థాయిలో నిధులను సేకరించి నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని ఇప్పటికే పంట, మురుగు కాలువలు అభివృద్ధి చేశామని అందువల్ల భారీ తుఫాన్‌లు వచ్చినా ముంపు సమస్య లేకుండా కాపాడగలిగామన్నారు. మాజీ ఎమ్మెల్సీ

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమన్న కామినేని

కమ్మిలి విఠలరావు, నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మి, ఎంపీపీ అడవి కృష్ణ, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, కూటమి నేతలు బొర్రా చలమయ్య, పోకల జోగిరాజు, చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి, బీకేఎం నాని, పేరిచర్ల ప్రసాదరాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, సజ్జా బాబీ, పైడిపాటి శివశంకర్, కాంట్రాక్టర్ కృష్ణంరాజు, నున్న రమాదేవి, ఏఈ శ్రీని వాస్, పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, కేకే బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వరి, కొల్లి వరప్రసాద్, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సేవా కార్యక్రమాలు..

మండవల్లి: డాక్టర్ కామినేని పుట్టినరోజును పురస్కరించుకొని బుధవారం కూటమి నాయకు లు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లింగాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు, వృద్ధులకు దుప్పట్లు పంచారు. ఇందులో మండల పార్టీ అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, మాణిక్యాలరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో లాభసాటి వ్యవసాయం : మంత్రి పార్థసారథి



ప్రకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న మంత్రి

ఆగిరిపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యాంత్రీకరణతో వ్యవసాయం లాభదాయకమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నెక్కలం గొల్లగూడెంలో బుధవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కూలీల కొరత ఎక్కువగా ఉన్నందున యాంత్రిక శక్తి ఉపయోగించుకోవాలని కోరారు. రైతులకు రోటొవేటర్, డ్రోన్, ట్రాక్టర్లు ఇలా పలు వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వం 90 శాతం రాయితీపై అందిస్తోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో సాగు చేస్తే నీటి వినియోగం తగ్గుతుందన్నారు. వరిపంటను తగ్గించి పామాయిల్, కోకో, మొక్కజొన్న లాంటి వాణిజ్య పంటలు వేయాలని, అంతర్ పంట వేస్తే రైతులు లాభాలు గడించవచ్చన్నారు. మామిడి రైతులకు పేను సమస్య ఎక్కువగా ఉన్నందున 4 నెలలు ముందుగానే పరిష్క రించుకోవాలని తెలిపారు. సుమారు 200 కోట్లతో నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పరిచానని, ఆర్‌అండ్‌బీ, సీసీ రోడ్లు, చెరువుల మరమ్మతులు, ప్రభు త్వ భవనాల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టామ న్నారు. త్వరలో చింతలపూడి కాలువ పనులు పూర్తి చేసి నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, అగ్రికల్చర్ జేడీ ఎస్‌కే హబీబ్ బాషా, తహసీల్దార్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని, టీడీపీ మం డల అధ్యక్షుడు వేణు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగం అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం: వీరమల్లు

ముదినేపల్లి: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు వ్యవసాయ రంగ పురోగతికి పంచ సూత్రాలను రూపొందించారని కైకలూరు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. వడాలి రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయ శాఖ నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలను లాభసాటిగా మార్చాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రూపొందించిన పంచసూత్రాలను రైతులు పాటించాల న్నారు. ఏడీఏ వెంకటమణి, ఏవో వేణుమాధవ్, వీఏఏ సంధ్య తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సీఎం పాల్గొన్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని టీవీల ద్వారా రైతులు వీక్షించారు. చిగురుకోటలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: మోరంపూడి

చాట్రాయి: రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చనుబండ రైతుసేవా కేంద్రంలో బుధవారం రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్‌లకు ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తుందని, ప్రభుత్వ సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీఏఏ నాగమణి, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలం



మాట్లాడుతున్న ఏపీ ఎన్‌జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

భీమవరం టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల డిమాండ్స్ గత ప్రభుత్వం నుంచి పేరుకుపోయాయని, ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడానికి ఏపీ ఎన్జీవో సంఘం బాధ్యత తీసుకున్నదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. భీమవరంలో జిల్లా ఏపీ ఎన్‌జీవోల అసోసియేషన్ అడహక్ కమిటీ ఏర్పాటు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్న సందర్భంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటంలో సుముఖంగా ఉందని, అందులో భాగంగా సుమారు రూ.11వేలకోట్లు ఉద్యోగుల ఖాతాల్లో జీపీఎఫ్ తదితర సొమ్ములు పడ్డాయని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు పెండింగ్ బకాయిలు సుమారు రూ.3,200 కోట్లు ప్రాన్ అకౌంట్స్‌లో జమ చేసేలా ఏపీ ఎన్జీవో సంఘం కృషి చేసిందన్నారు. హెల్త్‌కార్డ్స్ సరిగా విని యోగంలోకి రావటం లేదని దీని వలన ఉద్యోగవర్గం తీవ్రంగా నష్టపోతున్నారని,ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి డీవీ రమణ, చోడగిరి శ్రీనివాసరావు, నెరుసు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీవోల జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక

ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు జిల్లా సంఘం అడహక్ కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా ఉదిసి వెంకట పాండురంగారావు, కన్వీనర్‌గా పోతన సుకుమార్, కో- చైర్మన్‌గా అల్లూరి శ్రీనివాస రాజు, కో-కన్వీనర్లుగా ఎంఆర్‌కె రాజు, దేవాబత్తుల నాగ దేవి, ఇంజేటి రమేష్, సుంకర వెంకటేష్‌లను ప్రకటిచారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెనుమరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు శివ ప్రసాద్, రాం ప్రసాద్, జేఏసీ నాయకులు ఆర్‌ఎస్ హరనాథ్, రాష్ట్ర ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా భీమవరం పాత బస్ స్టాండ్ నుంచి బైక్ ర్యాలీగా త్యాగరాజ భవన్ వరకు సాగింది.

రైతన్నా మీ కోసం.. నేనున్నా!

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తున్నందుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును ప్రత్యేకంగా అభినందించారు. రోడ్ల పొడవునా కార్యకర్తలు బారులు తీరారు. పోలీసులు బందోబస్తు, భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. గోపాలపురం నియోజక వర్గంలో అభివృద్ధి పనుల నిమిత్తం రూ.320 కోట్ల ప్రణాళికను ఎమ్మెల్యే మద్దిపాటి సీఎంకు అందజేశారు. తొలుత నల్లజర్లలోని హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు,కలెక్టర్ కీర్తి చేకూరి,ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ డి.నర సింహకిశోర్, ఎమ్మెల్యేలు మద్ది పాటి వెంకట్రాజు,గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డివాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన నేత సువర్ణరాజు, మహిళా నేతలు స్వాగతం పలికారు.

సీఎం పక్కనే...

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇద్దరు రైతులను తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. అందులో ఒకరు ప్రకాశరావుపాలేంకు చెందిన రైతు, మాజీ సర్పంచ్ నీలపాట నరసింహం కుడివైపు కూర్చోగా, నల్లజర్లకు చెందిన గుదే అర్జునరావు ఎడమ వైపు కూర్చున్నారు. దీని తమ అదృష్టంగా భావిస్తున్నట్టు వారిద్దరూ పేర్కొన్నారు.

విందు.. పసందు..

సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ప్రజలకు విందు పసందుగా ఏర్పాటుచేశారు. సీఎం చంద్రబాబు 'రైతన్న మీకోసం' వచ్చిన వేళ రైతులు, అధికారులు, కార్యకర్తలు, నాయకులు, సామాన్య ప్రజలకు సుమారు 12 వేల మందికి కేసరి స్వీట్, బిర్యానీ, కోడికూర, సాంబారు అన్నం, పెరుగన్నంతో భోజనం వడ్డించారు. ఉదయం 10.30 గంటల నుంచే సుమారు 10 స్టాల్స్ ఏర్పాటు చేయడంతో ఎవరికీ ఇబ్బంది లేకుండా భోజనాలు చేశారు.

టెన్త్ ఉత్తీర్ణత పెంచాలి : డీవైఈవో

ముసునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని నూజివీడు డివైఈవో డాక్టర్ పి.యస్. సుధాకర్ అన్నారు. బుధవారం ముసునూరు జడ్పీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో ఆహార నాణ్యత తనిఖీ చేసి, విద్యార్థులతో కలసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల క్రీడా ప్రాంగణంలోని గడ్డి, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం శైలజను ఆదేశించారు. స్టాఫ్ సెక్రటరీ జి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

ముసునూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ హెచ్చరికలతో కల్లాలపై ఉన్న ధాన్యాన్ని రైతులు భద్రపరుచుకోగా, తుఫాన్ ప్రభావం తగ్గిపోవడంతో ధాన్యం కొనుగోళ్లను అధికారులు వేగవంతం చేశారు. చెక్కపల్లి, ముసునూరు, గోగులంపాడు, లోపూడి, గోపవరం తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు జోరందుకోవటంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యాన్ని గోనె సంచుల్లో పట్టి, వెంటనే రైస్ మిల్లులకు రవాణా చేస్తున్నారు. ఇప్పటికి వరకు 3550 మెట్రిక్ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు పంపినట్లు మండల వ్యవసాయ అధికారిణి ఎ. చాముండేశ్వరి తెలిపారు. మండలంలో 6400 ఎకరాల్లో వరి పంట సాగైందని, ఇప్పటి వరకు 2800 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, వాతావరణం బాగానే ఉన్నందున రైతులు వరి కోతలను కోస్తున్నారన్నారు.

నూజివీడు మండలంలో..

నూజివీడు టౌన్: నూజివీడు మండలంలో 911 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని నూజివీడు వ్యవసాయశాఖ అధికారి చెన్నారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నూజివీడు మండలంలోని 3175 ఎకరాలలో ధాన్యం సాగవగా ఇప్పటి వరకు 840 ఎకరాలలో వరికోతలు పూర్తయ్యాయన్నారు. మొత్తం 145 రైతుల నుండి 911 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందని ఆయన తెలిపారు.

35 మందికి ఉద్యోగాలు

కైకలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సృజనాత్మకత తోనే ఉపాధి అవకాశాలు కలుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీలత అన్నారు. బుధవారం కైకలూరు వైవీఏన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా 156 మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో 35 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి పాల్గొన్నారు.

ఎంవీఐ కార్యాలయాల్లోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

నూజివీడు టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని గతంలోలా ఎంవీఐ కార్యాలయాల్లోనే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నూజివీడు ఎంవీఐ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి జి. రాజు మాట్లాడుతూ ఫిట్‌నెస్‌కు మాత్రం రాజమండ్రి, మచిలీపట్నం వంటి ప్రాంతాలకు ఇవ్వడం వల్ల దాదాపు 200 కిలోమీటర్లు వరకు ప్రయాణించాల్సి ఉందని, ఎంవీఐ కార్యాల యాల్లోనే పునరు ద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మండవల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఈఓ సురేష్ పేర్కొన్నారు. మండవల్లి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం మండలంలోని అయ్యవారి రుద్రవరం దళితవాడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, పూర్వ విద్యార్థి చిరిగిరి పిచ్చేడు ఆర్థిక సాయంతో 120 మంది పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ చేశారు.

టీడీపీ గ్రామ అధ్యక్షుడు బసవ శంకరరావు మృతి



కైకలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ పల్లెవాడ గ్రామ అధ్యక్షుడు మత్తె బసవ శంకరరావు (67) బుధవారం మృతి చెందారు. ఇటీవల ఆయన గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. హైదరాబాదులో కుమార్తె ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా అస్వస్థతకు గురై హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రి లో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కామినేని, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు తదితరులు సంతాపం తెలిపారు.